రంజాన్ వేళలు	ఇఫ్తార్ (గురు)	సా.6.20
	సహరి (శుక్ర)	ఉ.4.56

తాడిపూడి మృతుల బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం 8

చేనేత సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన గోరంట్ల



రాజమహేంద్రవరం మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత కార్మికుల పరిస్థితేంటి? వారి వృత్తి లాభదాయకంగా ఉందా, ఇబ్బందులు పడుతున్నారా? యంత్రాల రంగ ప్రవేశంతో చేతన కార్మికుల జీవన స్థితిగతులేంటి? వీరి విషయంలో ప్రభుత్వం దగ్గర ఏవిధమైన సమాచారం ఉంది, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం తీసుకునే చర్యలు ఏమిటని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అసెంబ్లీలో ప్రశ్నించారు. బుధవారం అసెంబ్లీ జీరో అవర్‌లో ఆయన సభ దృష్టికి ఈ సమస్యలను తీసుకువెళ్లారు. దీనిపై సంబంధిత మంత్రి స్పందిస్తూ చేనేత కార్మికుల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని, గత ప్రభుత్వంలో మరీ అధ్వానమైందని, వారిని ఆదుకోవాడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు ప్రకటించారు. పాత బాకీలు రద్దుచేయాలని, ఆప్కోను ప్రోత్సహించాలని గోరంట్ల కోరారు.

కమ్యూనిటీ హాళ్లను ఖాళీ చేయించాలని కోరిన ఆదిరెడ్డి



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో కమ్యూనిటీహాళ్లను సచివాలయాలుగా మార్చేశారని, వాటి అవసరం లేనిచోట్ల ఖాళీచేయించాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో టీడీపీ ప్రభుత్వం రాజమహేంద్రవరంలో పేదలు, బలహీనవర్గాల ప్రజలకు ఫంక్షన్లకు, ఇతర కార్యక్రమాలకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాళ్లను నిర్మించిందన్నారు. వాటిని వైసీపీ అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి గత ఐదేళ్లుగా ఈ కమ్యూనిటీ హాళ్లలో సచివాలయాలను ఏర్పాటుచేసిందన్నారు. జిప్లస్ వన్ కమ్యూనిటీ హాళ్లను కూడా తీసుకుని, పైనా కిందా సచివాలయాలు ఏర్పాటు చేసిందని, దీనివల్ల ప్రజలకు ఇవి అందుబాటులో లేకుండాపోయాయన్నారు. వీటిని అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

రయ్..రయ్..



సామర్లకోట- వేమగిరి కెనాల్ రోడ్



రామచంద్రపురం- కరప - కాకినాడ రోడ్డు

- ఉమ్మడి తూ.గో. జిల్లాలో పీపీపీ విధానంలో రహదారుల అభివృద్ధి
- కాకినాడ-జొన్నాడ, కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్ రోడ్ల ఎంపిక
- వీటిని పీపీపీ విధానంలో అభివృద్ధికి నిర్ణయం
- సాధ్యాసాధ్యాలపై డీపీఆర్‌ల తయారీ బాధ్యత ఎల్ఎన్ మాలవ్య సంస్థకు అప్పగింత
- ఈ రోడ్లపై వాహన రద్దీ, ఎంత కాలానికి పీపీపీ అనేదానిపై ఏడాదిలో అధ్యయన నివేదిక
- కాకినాడ-జొన్నాడ రహదారి అభివృద్ధికి రూ.225 కోట్లు ఖర్చవుతుందని అంచనా
- కరప, వేళంగి, ఆలమూరు, మండపేటలలో బైపాస్‌లు నిర్మాణంతో భారీగా పెరగనున్న ఖర్చు
- అటు కెనాల్ రోడ్డు అభివృద్ధికి రూ.160 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా
- అన్నీ కుదిరితే వచ్చే ఏడాదే ఈ రహదారుల నిర్మాణానికి టెండర్లు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అత్యంత కీలకమైన కాకినాడ-జొన్నాడ, కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్ రహదారులకు మంచి రోజులు రాబోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ రెండు రహదారులపై నిత్యం వేలల్లో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. తీరా ఇవి అత్యంత ఇరుకైన రహదారులు కావడంతో నిత్యం ట్రాఫిక్ నరకంతోపాటు ప్రయాణ సమయం చాలా ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఈ రెండింటిని పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వీటి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి నివేదిక తయారుచేసే బాధ్యతను తాజాగా ఎల్ఎన్ మాలవ్య కంపెనీకి అప్పగించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు పట్టణాలు, నగరాలు, జాతీయ రహదారిని కలిపే అనేక కీలక రహదారులు గడచిన అయిదేళ్లలో పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఏమాత్రం అభివృద్ధికి నోచుకోక ప్రయాణి కులకు నరకం చూపిస్తున్నాయి. ఒకపక్క భారీ గుంతలు పడ్డా గత వైసీపీ సర్కారు వీటిని గాలికి వదిలేసింది. దీంతో ప్రజలు పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక రహదారులను కోట్లు ఖర్చుచేసి మరమ్మతులు చేసింది. అయితే వీటిలో అత్యంత కీలకమైన రోడ్లను మాత్రం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని, వీటికయ్యే ఖర్చును ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా భరించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు రహదారులను ఎంపిక చేసింది. వీటిలో ఒకటి కాకినాడ-జొన్నాడ, మరొకటి కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్ రోడ్డు. 62 కిలోమీటర్ల పొడవున్న కాకినాడ- జొన్నాడ రహదారి ఉమ్మడి జిల్లాలో అత్యంత కీలకం. కాకినాడ జిల్లా నుంచి కోనసీమ జిల్లాకు అనుసంధానించే ఈ రహదారి ద్వారా రావులపాలెం జాతీయ రహదారికి చేరుకోవచ్చు. అయితే ఈ రోడ్డు కాకినాడ నగరం నుంచి కరప, వేళంగి, రామచంద్రపురం, మండపేట, ఆలమూరు మీదుగా వెళ్తుంది. నిత్యం ఈ రోడ్డు భారీగా రద్దీగా ఉంటుంది. రావులపాలెం, విజయవాడ, హైదరాబాద్ వెళ్లే బస్సులు, కార్లు, ఇతర లారీలన్నీ ఈ దారి మీదుగానే ప్రయాణిస్తాయి. కానీ ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన ఈ రహదారి ఇప్పుడున్న ట్రాఫిక్‌ను ఏమాత్రం తట్టుకోలేని విధంగా మారింది. రోడ్డు ఎక్కడికక్కడ చాలా చిన్నది కావడంతో వచ్చీపోయే వాహనాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. ఈ ఆర్అండ్‌బీ రహదారిని పీపీపీ విధానంలో భారీస్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అటు 50 కిలోమీటర్ల పొడవు న్న కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్ రోడ్డు సైతం ఈ రెండు నగరాలను కలిపే కీలక రహదారి. ఒక రకంగా ఏడీబీ రోడ్డుతో పోల్చితే కెనాల్ రోడ్డు ద్వారా రెండు నగరాల మధ్య దూరం తక్కువ. ప్రస్తుతం లారీలు, కార్లు, బస్సులు ఇతర వాహనాలన్నీ ఈ రోడ్డుపై నుంచే వెళ్తున్నాయి. మధ్యలో అనేక గ్రామాలు, పట్టణాలు ఉండడంతో ట్రాఫిక్ దారుణంగా ఉంటోంది. రహదారి చాలా ఇరుగ్గా ఉండడంతో నిత్యం నరకమే. దీంతో దీన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

వచ్చే ఏడాదిలోగా పనులు..

ఈ రెండు రహదారులను పీపీపీ విధానంలో భారీగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి నిర్మాణ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయించడానికి సిద్ధమైంది. ఈమేరకు ప్యాకేజీ 3 కింద డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించడానికి టెండర్లు పిలిచింది. వీటిని తాజాగా మధ్యప్రదేశ్‌కు చెంది ఎల్ఎన్ మాలవ్య సంస్థ ఈ కాంట్రాక్టు దక్కించుకుంది. త్వరలో ఈ రెండు రహదారుల అభివృద్ధి ఈ కంపెనీ పూర్తిస్థాయి నివేదిక తయారు చేయనుంది. అందులోభాగంగా ఈ రోడ్లను అభివృద్ధి చేసే విషయంలో సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయనుంది. ఆయా రోడ్లపై వాహనరద్దీ ఎంత ఉంది అనేదానిపై కొంతకాలం పరిశీలించనుంది. ఈ రోడ్లను అభివృద్ధి చేస్తే ఎంత కాలానికి పీపీపీ విధానంలో కాంట్రాక్టర్‌కు అప్పగించవచ్చు.. టోల్ వసూలెంత చేయాల్సి ఉంటుంది.. రహదారిని నిర్మించిన తర్వాత టోల్ ద్వారా కాంట్రాక్టర్‌కు వెచ్చించినంత మొత్తం రాకపోతే ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ద్వారా ఎంత చెల్లించాలి? తదితర అంశాలపై డీపీఆర్‌లో ఈ కంపెనీ వివరించనుంది. ఈ నివేదికను వచ్చే ఏడాది ఈ సంస్థ ప్రభుత్వానికి అప్పగించనుంది. ఆ తర్వాత రోడ్లను విస్తరించి కొత్తగా నిర్మించడానికి టెండర్లను పిలవనుంది. కాకినాడ-జొన్నాడ రహదారిలో ఇప్పటికే పలు పట్టణాలు, గ్రామాలు భారీగా విస్తరించినందున నాలుగులేన్ల కొత్త రహదారి అభివృద్ధికి భూములు, ఇళ్లు సేకరించాల్సి వస్తుందని, అదే జరిగితే ఖర్చు భారీగా ఉంటుందని అంచనాకు వచ్చారు. ఈనేపథ్యంలో కరప, వేళంగి, మండపేట, ఆలమూరు మీదుగా కొత్తగా బైపాస్‌లు నిర్మించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇందుకు రూ.225కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. అలాగే కెనాల్ రోడ్డుకు సైతం నాలుగు రహదారులు నిర్మించాల్సి రావడం, అటు అనపర్తి, వేమగిరి పట్టణాల మీదుగా రహదారి వెళ్తుండడంతో వీటిని బైపాస్ చేస్తూ కొత్తగా రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉంది. అలాగే కేశవరం,వేట్లపాలెం, బ్రహ్మదేవం ప్రాంతాల్లో కాలువ, రైల్వే ట్రాక్, రోడ్డు పక్కపక్కనే ఉన్నాయి. ఈనేపథ్యంలో వీటి వద్ద కూడా బైపాస్ అవసరం. మిగిలిన రహదారి వెంబడి కాలువ ఉండడంతో భూసేకరణకు పెద్దగా ఖర్చు కాదు. అయితే ఈరోడ్డును అభివృద్ధి చేయాలని ఇప్పటికే కూటమి అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబును కలిసి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పలు దఫాలుగా వినతిపత్రం అందించారు. దీంతో పీపీపీ విధానంలో ఈ రోడ్డు చేర్చారు. అయితే కెనాల్ రోడ్డుకు రూ.160 కోట్ల కంటే ఎక్కువ వ్యయం అవుతుందని అధికారులు అంచనాకు వచ్చారు.

ఎంపీ లాడ్స్ తీయరేమి..

- రూ.5 కోట్లు ఉన్నా పనుల్లో జాప్యం
- ప్రతిపాదనలు పంపిన ఎమ్మెల్యేలు
- మళ్లీ రెండో విడత వచ్చేస్తోంది
- ఇప్పటికైనా శ్రద్ధ పెడతారా..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సాధారణంగా అభివృద్ధి పనులకు నిధుల కొరత వేధిస్తుంది. కొన్ని సందర్భాల్లో పనులు ముగించినా బిల్లులు పెండింగ్‌లో ఉండే పరిస్థితులు ఉంటాయి. కానీ ఎంపీ ల్యాడ్స్ నిధులు వాటికి పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. చేతిలో డబ్బులు ఉన్నా చేతల్లో జాప్యం వల్ల అభివృద్ధి పనులకు ఖర్చు కావాల్సిన ఎంపీ ల్యాడ్స్ నిధులు ఉపయోగపడడానికి నెలల తరబడి ఎదురుచూపులు చూస్తున్నాయి. ఎమ్మెల్యేల నుంచి ప్రతిపాదనలు ఎంపీ కార్యాలయానికి ఎప్పుడో అందినా ఎంతో తర్జనభర్జన అనంతరం మొదటి అడుగు ఇప్పుడు పడింది. మళ్లీ ఏప్రిల్ నెల వస్తే రెండో విడత నిధులు కూడా జమ అవుతాయి. అభివృద్ధి పనుల్లో వేన్నీళ్లకు చన్నీళ్ల మాదిరిగా ఉపయోగపడాల్సి నిధులు నిద్రావస్థలో ఉన్నాయి. పోనీ ఎక్కడా అభివృద్ధి పనులు అవసరం లేదా? అనుకుంటే.. రోడ్లు, డ్రైన్లు వంటి కనీసం అవసరాలు కూడా లేని ఊర్లు చాలానే ఉన్నాయి. ఎంపీ ల్యాడ్స్ నిధుల విడుదల జాప్యంపై ప్రత్యేక కథనం..

● ఎంపీ ల్యాడ్స్ అంటే?

ప్రతి పార్లమెంట్ సభ్యుడు/సభ్యురాలికి తన నియోజకవర్గ పరిధిలోని అభివృద్ధి పనులు చేసుకోడానికి కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాదీ రూ.5 కోట్ల నిధులు ఇస్తుంది. వీటిని మెంబర్ ఆఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డవలప్‌మెంట్ స్కీం(ఎంపీఎల్ఏడీఎస్) అంటారు. వీటితో ప్రజలకు ఉపయుక్తంగా ఉండే పనులు మాత్రమే చేయాల్సి ఉంటుంది. వ్యక్తిగత అవసరాలకు తావుండదు. ఏవైనా వేరే నిధులకు మ్యాచింగ్ గ్రాంటుగా కూడా వీటిని వాడుకోవచ్చు. అంటే ఉదాహరణకు ఓ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.50 లక్షలు అంచనా వేస్తే.. ఆ పనికి నిధులు రూ.40 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదల అయితే.. ఎంపీ ల్యాడ్స్ నుంచి మిగతా రూ.10 లక్షలు ఇవ్వవచ్చు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సీసీ రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ హాల్స్. ఇలా ప్రజావసరార్థం ఆ నిధులను వినియోగించాలి. గతంలో కలెక్టర్ అకౌంట్‌కి ఈ నిధులను జమ చేయడం జరిగేది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'ఈ-సాక్షి' పోర్టల్ ద్వారా నిధులు ఇస్తున్నారు. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన కొద్ది రోజుల్లోనే రూ.5కోట్లు ఆ పోర్టల్‌లో జమ అవుతాయి. ఆయా ఎమ్మెల్యేలు, సంస్థల నుంచి వచ్చే అభ్యర్థలను పరిశీలించి ఎంపీ కేంద్ర ప్రభుత్వ లాగిన్‌లో తన అంగీకారాన్ని తెలుపుతారు. అక్కడి నుంచి కలెక్టర్‌కి ఆ పనుల జాబితా వస్తుంది. వాటి అవసరతపై మళ్లీ పరిశీలన చేసిన తర్వాత సంబంధిత ప్రభుత్వశాఖలు అంచనాలు తయారుచేసి టెండర్లు పిలుస్తాయి. 1993-94 బడ్జెట్‌లో రూ.5 లక్షల చొప్పున మొదలైన ఈ కేటాయింపులు 94-95లో రూ.కోటి, 98-99లో రూ.2 కోట్లు, 2011-12 నుంచి రూ.5కోట్లు ఇస్తున్నారు. ప్రతి ఏడాదికి రూ.5కోట్లు చొప్పున ప్రతీ ఎంపీకి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంది. ఇవి ఒకవేళ ఆ ఏడాదిలో ఉపయోగించకపోతే మరుసటి ఏడాదికి జమ అవుతాయి. ఇలా ఖర్చు చేయకుండా ఉన్న నిధులు తర్వాత వచ్చే ఎంపీలు వినియోగించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అంటే.. ఇప్పుడు అధికారంలో ఉన్న ఎంపీలు ఖర్చు చేయకపోతే తర్వాత అధికారంలోకి వచ్చే ప్రభుత్వం, అప్పటి ఎంపీకి ఆ ఘనత దక్కినట్టు అవుతుంది.

● ఇంకా పైసా ఇవ్వలే..

రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పురందేశ్వరి విజయం సాధించిన కొద్ది రోజులకే ఈ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ఎంపీ ల్యాడ్స్ వచ్చేశాయి. అంటే ఎంపీ ల్యాడ్స్ రూ.5కోట్లు వచ్చి సుమారు 6 నెలలు గడిచింది. కానీ ఇప్పటికీ పైసా ఖర్చు చేయలేదు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గంలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. నిడదవోలు, రాజానగరం జనసేన ఎమ్మెల్యేలు, అనపర్తి బీజేపీ, మిగతా చోట్ల టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే రూ.80లక్షలు, రూరల్ ఎమ్మెల్యే సుమారు రూ.50 లక్షలకు ప్రతిపాదనలు పంపించారు. రాజానగరం, నిడదవోలు, గోపాలపురం ఎమ్మెల్యేలు కూడా ఎంపీ ల్యాడ్స్ కోసం అర్జీలు పంపారు. చివరిగా అనపర్తి, కొవ్వూరు వెళ్లాయి. అయితే ఇప్పటివరకూ ఎవరికి ఎంత?, ఏ పనికి ఇవ్వాలనే మీమాంసలోనే కాలం గడిపేశారు. ఆ వడపోత అనంతరం నియోజకవర్గానికి రూ.60 లక్షల చొప్పున కేటాయించినట్లు తెలుస్తోంది. వాటికి సంబంధించి ఎంపీ ల్యాడ్స్ లాగిన్‌లో ప్రక్రియ రెండు రోజుల క్రితమే పూర్తయినట్టు సమాచారం. అంటే తదుపరి ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభం కావడానికి ఇంకా రెండు నెలలు పడుతుంది. ఈలోపు రెండో విడత ఎంపీ ల్యాడ్స్ నిధులు జమవుతాయి. అయితే సార్వత్రిక ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వాలు కొలువుదీరడం, కుదురుకోడానికి సమయం పట్టడం వల్ల ఎంపీ ల్యాడ్స్ ఖర్చు చేయడానికి సమయం పట్టినట్లు తెలుస్తోంది. ఎంపీ ల్యాడ్స్ నిధులను రూ.5కోట్ల నుంచి రూ.25కోట్లకు పెంచాలని గతంలో యాన్యువల్ రిఫామ్స్ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసినా.. ఇచ్చిన నిధులనే మురగబెడుతున్నారనే కారణంతో ఆ సిఫారసులను తిరస్కరించడం గమనార్హం.

పీడీఎస్ బియ్యం వేలం

రాజమహేంద్రవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ 6ఏ కేసుల్లో సీజ్ చేసిన 47.274 టన్నుల పీడీఎస్ (రేషన్ బియ్యం) బియ్యాన్ని గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్‌లో నిల్వ చేశామని జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు తెలిపారు. వాటికి కిలో రూ.30 చొప్పున ధర నిర్ణయించామని, ఈనెల 11న ఉదయం 11 గంటలకు అక్కడే బహిరంగ వేలం నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనవచ్చని, జీఎస్టీ లైసెన్స్ కలిగి ఉండాలని రూ.2 లక్షలు జాయింట్ కలెక్టర్, తూరుగోదావరి పేరున డీడీ రూపంలో ధరావత్తుగా చెల్లించాలని పేర్కొన్నారు.

నేడు గీతకార్మిక కులాలకు మద్యం షాపుల కేటాయింపు

రాజమహేంద్రవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గీతకార్మిల కులాలకు మద్యం షాపుల కేటాయింపునకు గురువారం ఉదయం 10 గంటలకు సబ్‌కలెక్టరేట్లో లాటరీ పక్రియ నిర్వహిస్తున్నారు. లాటరీలో ఎంపికైన వారికి మద్యం షాపులను కేటాయిస్తారు. 2024-26 మద్యం పాలసీలో భాగంగా కూటమి ప్రభుత్వం గీత కార్మిక కులాలకు 10 శాతం మద్యం దుకాణాలను ప్రకటించిన విషయం తెలిసిందే. దీని ప్రకారం జిల్లాలో 13 షాపులు వారికి కేటాయించాల్సి ఉంది. దీనిలో శెట్టిబలిజకు 11, గౌడ, గౌడ్‌కు ఒక్కోటి చొప్పున కేటాయిస్తారు. 13 షాపులకు సంబంధించి శెట్టిబలిజ నుంచి 330, గౌడ 9, గౌడ్ కులస్తుల నుంచి 48 దరఖాస్తులు అందాయి.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, సినీనటుడు బాలాజీ తదితరులు

అంబులెన్స్‌ను ప్రారంభించిన కలెక్టర్ ప్రశాంతి

ధవళేశ్వరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థకు ఈసీతః కంపెనీ సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన అంబులెన్స్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం తన కార్యాలయం వద్ద ప్రారంభించి స్వచ్ఛంద సంస్థకు అందజేశారు. ఈ సందర్భంగా పార్డ్ ఇండియా అందిస్తున్న సేవలను కొనియాడుతూ సంస్థ ఫౌండర్ వీవీ బీవీ స్వామిని అభినందించారు. గోపాలపురం నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాల్లో అవసరమైన వారికి ఉచిత అంబులెన్స్ సర్వీసును ప్రారంభించడంపై హర్షం వ్యక్తంచేశారు. సినీనటుడు బాలాజీ, పార్డ్‌ఇండియా జాతీయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, మహ్మద్ ఇలియా షరీఫ్, సీహెచ్ కృష్ణప్రసాద్, యానాపు ఏసు, బి.రామారావు పాల్గొన్నారు.

రొయ్య.. రోదన!



- పడిపోయిన రొయ్యల ధరలు
- పంట చేతికివచ్చే సమయంలో.. భారీగా తగ్గుదల
- ఎగుమతిదారుల సిండికేట్‌తో రైతులు విలవిల
- పెరిగిన ఉత్పత్తి వ్యయం.. కుదేలవుతున్న ఆక్వారంగం
- నాణ్యతలేని సీడు, పెరిగిన విద్యుత్ చార్జీలు, ఫీడ్ ధరలు
- కాలుష్య కారకాలుగా మారుతున్న ఆక్వా చెరువులు
- ప్రభుత్వమే ఆక్వాను ఆదుకోవాలి : రైతుల డిమాండ్

అమలాపురం/అంతర్వేది, మార్చి5(ఆంధ్రజ్యోతి): విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిపెట్టే ఆక్వారంగం క్రమంగా కుదేలవుతోంది. పెరుగుతున్న పెట్టుబడి వ్యయానికి తగ్గట్టు ఉత్పత్తి అయిన రొయ్యలకు సరైన లభించకపోవడంతో ఆక్వా రైతులు నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ఎగుమతిదారులు సిండికేట్‌గా తయారై ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అయ్యే సమయానికి ధరలను ఇష్టారాజ్యంగా తగ్గించేయడంతో ఆ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికితోడు నాణ్యతలేని రొయ్య సీడు సరఫరా, విద్యుత్ చార్జీల భారం, ఆక్వా ఫీడ్ ధరల పెరుగుదలతోపాటు ఉత్పత్తి వ్యయాలు అనూహ్యంగా పెరిగిపోతుండడంతో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని ఆక్వా సేద్యం చేస్తున్న రైతులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. దీనికితోడు రొయ్యల చెరువుల లీజు కూడా రికార్డుస్థాయికి చేరిపోయింది. కానీ ఆక్వా పంట విక్రయించే సమయంలో మాత్రం ఎగుమతిదారులు పెట్టిందే రేటు.. వారు కొంటేనే రైతుకు దిక్కు అన్న చందంగా పరిస్థితులు మారిపోతున్నాయి. దీంతో రానున్న రోజుల్లో ఆక్వా సేద్యం గడ్డు పరిస్థితులను ఎదుర్కోనుంది. ఆక్వా సేద్యం చేస్తున్న రైతులకు రొయ్య పిల్లల సీడ్ చెరువులో వేసిన నాటి నుంచి అది పెరిగి పెద్ద అయి కౌంట్ దశకు చేరే సమయం వరకు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. గతంకంటే భిన్నంగా సాగు సమయంలో అనేక కష్టాలు పడాల్సి వస్తోంది. ఒకవైపు విపరీతంగా పెరిగిపోతున్న ఆక్వాచెరువులు. మరోవైపు కాలుష్యం కారకాలుగా ఆ ప్రాంతాలు తయారు కావడంతో చెరువుల సాగుకు అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల వల్ల రొయ్యలు, చేపలపై వివిధ రకాల వైరస్‌లు దాడి చేస్తున్నాయి. ఫలితంగా ఆ పంటలు సాగుచేస్తున్న ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికి కారణం హేచరీల్లో నాణ్యతలేని సీడును ఉత్పత్తిచేసి మాయమాటలతో రైతులను బురిడీ కొట్టించి వాటిని సరఫరా చేయడం ద్వారా భారీ సొమ్ము చేసుకుంటున్నారు. వీటికితోడు పెరిగిన విద్యుత్ చార్జీలు, అడ్డూ అదుపులేకుండా ఆక్వాసేద్యానికి సంబంధించిన ఎరువులు, వ్యాక్సీన్లు, మేత రేట్లు పెంచి రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని ఆక్వా రైతులు ఆరోపిస్తున్నారు. పంట సాగుకు వచ్చే సమయంలో ముఖ్యంగా ఆక్వారంగానికి చెందిన ఎగుమతిదారులు సిండికేట్‌గా మారి ధరలు అమాంతంగా తగ్గించడంతో పంట దిగుబడి, రొయ్య కౌంట్ ధరలపైనా ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు వారు ఇస్తున్న షాక్‌తో నష్టం వాటిల్లుతోంది. గతేడాది మే నెలలో వంద కౌంట్ ధర కిలో రూ.220 పలికేది. అయితే ఆ కౌంట్ సాగు చేయడానికి రూ.250 పైనే ఖర్చు అవుతుందని ఆక్వా రైతులు చెబుతున్నారు. గత ఏడాదిలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కిలో కౌంట్ రొయ్య ధర రూ.260 వరకు పెరిగింది. ఒక దశలో వంద కౌంట్ రూ.270 కూడా కొనుగోలు చేశారు. ఈ ధర కొన్ని నెలలపాటు నిలకడగా కొనసాగడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. అయితే గత కొన్ని రోజులు నుంచి క్రమంగా వీటి ధరలు తగ్గుముఖం పట్టాయి. మహాశివరాత్రి పర్వదినం నుంచి రొయ్యల ధరలు పతనం ప్రారంభమై వంద కౌంట్ ధర రూ.200కు పడిపోయింది. ఎగుమతిదారులు సిండికేట్ అయి పండుగల పేరిట రొయ్యల ధరలను తగ్గిస్తూ తమ జీవితాలతో ఆడుకుంటున్నారని ఆక్వాసాగు చేస్తున్న వందలాదిమంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి



ప్రస్తుతం ఉన్న ఆక్వా రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంతో ఎదురుచూశాం. అయితే ఒక్కసారిగా మూడ్రోజుల్లో రూ.30 ధర తగ్గడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సీడులో నాణ్యత లేకపోవడం, విద్యుత్ చార్జీలు, రొయ్య మేత ధర పెంపుపై రైతులను ఎగుమతిదారులు తీవ్ర ఇక్కట్లకు గురిచేస్తున్నారు. చిన్నాపెద్దా ఆక్వా సాగు చేసుకునే రైతులకు సరైన నాణ్యత గల సీడు, సరఫరాచేసి ఉత్పత్తి సమయంలో ధరలను నిలకడగా ఉంచితే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు. - నల్లా సత్యకిరణ్‌ప్రసాద్, ఆక్వా రైతు, అంతర్వేది

ధరల్లో రోజురోజుకు క్షీణత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆక్వారంగ ఉత్పత్తుల ధరల పెరుగుదల చూపించినట్టే చూపి హఠాత్తుగా వాటిని తగ్గించేశారు. దాంతో ఈ ఏడాది ఫిబ్రవరి 20న ఉన్న ధరలతో పోలిస్తే మార్చి మొదటి వారంలో ఇప్పటివరకు రూ.150 తగ్గించేశారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రతీ కౌంట్‌కు కిలోకు సగటున రూ.30 వరకు ధర తగ్గించారు. ప్రతీ రైతుకు ఎకరానికి కనీసం రూ.లక్ష వరకు నష్టం వాటిల్లితున్నట్టు రైతులు వాపోతున్నారు. కాగా ఫిబ్రవరి 20న వంద కౌంట్ రూ.260 ఉండగా, 90 కౌంట్ రూ.270, 80 కౌంటు రూ.300, 70 కౌంట్ రూ.330, 60 కౌంట్ రూ.360, 50 కౌంట్ రూ.390, 40 కౌంట్ రూ.415 పలికేది. అయితే మార్చి 1వ తేదీన నుంచి 3వ తేదీ వరకు వంద కౌంట్ రూ.250 నుంచి రూ.230కి పడిపోయింది. 40 కౌంట్ రూ.400 నుంచి రూ.380కు పడిపోయింది. కానీ రైతుల నుంచి మాత్రం ఇంకా ధరలు తగ్గించి దళారులు తక్కువకు కొనుగోలు చేయడం వల్ల భారీగా నష్టపోతున్నారు.




పతకాల పూర్ణిమ

మోతుగూడెం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు క్రీడల్లో రాణిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెంలో ఏపీ జెన్‌కోలో అటెండరుగా పనిచేస్తున్న పొట్నూరి పూర్ణిమ మైదానంలో అడుగుపెడితే పతకంతోనే తిరిగొస్తుంది. ఏపీ జెన్‌కో డీఏవీ పాఠశాలలో చదువుకునే రోజుల్లోనే ఆటలపై మక్కువ పెంచుకున్నారు. తొమ్మిదో తరగతిలో ఉండగా అథ్లెటిక్స్ జోనల్, డివిజన్ స్థాయిల్లో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైంది. ఈమె తండ్రి గణేష్ పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో పనిచేసేవాడు. ఆయన ఉద్యోగంలో ఉండగానే చనిపోయారు. దీంతో తల్లికి ఉద్యోగం ఇచ్చారు. దురదృష్టవశాత్తు ఆమె కూడా చనిపోయింది. తల్లి ఉద్యోగ బాధ్యతను స్వీకరించిన పూర్ణిమ ప్రస్తుతం లోయర్ సీలేరు ప్రాజెక్టు పొల్లూరు విద్యుత్ కేంద్రంలో ప్లాంట్ అటెండర్‌గా పని చేస్తోంది. ఆమె బరిలో దిగితే ప్రత్యర్థులకు చెమటలు పట్టవలసిందే. షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో జాతీయ స్థాయిలో బంగారం పతకం గెలుచుకుంది.



సాధించిన షీల్డులతో పూర్ణిమ

ఆత్మగౌరవంతో, స్వశక్తితో ఉన్నత స్థితికి చేరుకుని 'స్త్రీ'శక్తిని చాటిచెప్తున్నారు. విద్య, వైద్యం, వ్యాపారం, రాజకీయాలు, అంతరిక్షం, టెక్నాలజీ.... ఇలా అనేక రంగాల్లో రాణిస్తున్నారు. రంగం ఏదైనా పురుషులకు తామేమీ తీసిపోమని నిరూపిస్తున్నారు. అవరోధాలను అధిగమిస్తూ సాధికార దిశగా అడుగులేస్తున్నారు. నారీ భేరి మోగిస్తున్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కొందరు మహిళల విజయ ప్రస్థానాలను మీ ముందుంచుతున్నాం.



విజయనారి



అనపర్తిలో కూరగాయల దుకాణం నిర్వహిస్తున్న మాజీ సర్పంచ్ జయమ్మ

కూరగాయల జయమ్మ

- అరవై ఏళ్లు కూరగాయల వ్యాపారం
- 13ఏళ్ల రాజకీయ జీవితం
- ఎంపీటీసీ, సర్పంచ్‌గా జయానబీ ప్రస్థానం

అనపర్తి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల ఉంటే మహిళలు పురుషులకు తీసిపోరన్నదానికి తూర్పు గోదావరి జిల్లా అనపర్తికి చెందిన షేక్ జయానబీ (కూరగాయల జయమ్మ) జీవితమే నిదర్శనం. 12 ఏళ్ల ప్రాయంలోనే తండ్రి మార్కెట్‌లో నిర్వహించే దుకాణానికి వచ్చివెళ్తూ సహాయం చేసేది. అలా వ్యాపార రంగంలో అడుగుపెట్టిన ఆమె 72 ఏళ్ల వయసులోనూ వ్యాపారం నిర్వహిస్తూ నేటి తరం మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది. అప్పటి కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తేతలి రామారెడ్డి పిలుపుతో రాజకీయ రంగంలోకి ప్రవేశించి 1996, 2001 ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించారు. ఎంపీటీసీగా ఆమె సేవలను గుర్తించిన రామారెడ్డి 2003లో ఆమెకు అనపర్తి సర్పంచ్ పదవికి పోటీచేసే



దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డితో జయానబీ (పాత చిత్రం)

అవకాశం ఇచ్చారు. అప్పటికే ప్రజా సేవలో తనదైన ముద్ర వేసుకున్న జయమ్మ సర్పంచ్‌గా విజయం సాధించి అనపర్తి పంచాయతీకి మొట్టమొదటి మహిళా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఐదేళ్లపాటు గ్రామాభివృద్ధికి కృషి చేయడమే కాకుండా కొన్ని పనులు చేసి చెరగని ముద్ర వేసుకున్నారు. రాజకీయాల్లో ఉన్నది 13 సంవత్సరాలైనా ఎంతో తృప్తి పొందానంటున్నారామె. రాజకీయం అంటే సేవ అని, సంపాదని కాదని చెప్తారు. కూరగాయల వ్యాపారం చేసుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నానంటున్నారు. కడదాకా కూరగాయల జయమ్మగానే పిలిపించుకోవాలన్నదే తన అభిమతమని ఆమె 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.



ఢిల్లీలో జరిగిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న సర్పంచ్ కొమరం శ్రావణి, కార్యదర్శి శిరీష

ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ గోకవరం

జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం

గోకవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మహిళల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధిలో అన్ని విధాలా పురోగతి సాధిస్తున్నందుకు తూర్పు గోదావరి జిల్లా గోకవరం గ్రామ పంచాయతీకి అరుదైన గౌరవం దక్కింది. రాష్ట్రస్థాయిలో ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీలుగా ఐదు ఎంపికవ్వగా వాటిలో గోకవరం ఒకటి. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర మంత్రులు రాజీవ్ రంజన్‌సింగ్, ఎస్పీ సింగ్, అన్నపూర్ణాదేవి ఆధ్వర్యంలో మహిళా సాధికారితపై డిల్లీలో బుధవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో గోకవరం సర్పంచ్ కొమరం శ్రావణి, గ్రామ కార్యదర్శి బొర్రు శిరీష, మాజీ ఎంపీటీసీ పులపర్తి బుజ్జి పాల్గొని మహిళల భాగస్వామ్యంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మహిళల ప్రాతినిధ్యం తదితర అంశాలను వివరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎక్కడా లేని విధంగా సర్పంచ్, కార్యదర్శి, పంచాయతీ పాలకవర్గంలో మూడొంతుల మంది మహిళా సభ్యులు వున్నారు. అంతేగాక 400కు పైగా డ్వాక్రా సంఘాలు, వైద్యపరంగా మహిళలకు అందుతున్న సేవలు, ఉపాధి హామీ పథకంలో ఎక్కువ మంది మహిళలు లబ్ధి పొందడం వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుని గోవకరాన్ని ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ జాబితాలో చేర్చారు.

ఎంపీడీవో ఇంట.. అవార్డుల పంట

గండేపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఒక చేత్తో ఇంటిని, మరో చేత్తో మండలాన్ని చక్కదిద్దుతున్నారు. ఆమే గండేపల్లి ఎంపీడీవో నాతి బుజ్జి. మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారమె. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 55కిపైగా అవార్డులు, ఎంతోమంది ప్రశంసలు అందుకుంటున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం కట్టుంగ గ్రామానికి చెందిన బుజ్జి గ్రూప్-2కు ఎంపికై 1996లో ఈవోపీఆర్డీగా విధులు చేపట్టారు. ఆపై ఇన్‌చార్జి ఎంపీడీవోగా, 2000లో రెగ్యులర్ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వర్తించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఉంటే మండలాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చో ఆమె చేసి చూపించారు. పట్టువదలని విక్రమార్కుడిలా సిబ్బందితో కలిసి పనిచేస్తూ ఆ మండలానికి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తెస్తారు. మాజీ గవర్నర్లు ఎన్‌డీ తివారి, సుశీల్‌కుమార్ షిండే, కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, యనమల రామకృష్ణుడు, ప్రస్తుత మంత్రి నారా లోకేశ్ నుంచి ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం రోజున మంత్రి కందుల దుర్గేష్, గణతంత్ర దినోత్సవం రోజు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి నుంచి ఉత్తమ అవార్డులు పొందారు. సీఎం చంద్రబాబు, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి నుంచి అందుకున్న అవార్డులు ఆమె చేసే సేవలకు మరింత ఊతమిచ్చాయి.





సీఎం చంద్రబాబు నుంచి అవార్డు స్వీకరిస్తున్న బుజ్జి... అందుకున్న అవార్డులు

క్రీడలతో ఒత్తిడి దూరం

- కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
- ఉమ్మడి జిల్లా ఏపీఎన్జీవోల అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



క్రీడా మైదానంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్



బెలూన్లు ఎగురవేసి క్రీడలు ప్రారంభిస్తున్న దృశ్యం

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు తమ రోజువారి విధుల్లో ఒత్తిడిని అధిగమిం చేందుకు క్రీడలు దోహదపడతాయని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్క రించుకుని బుధవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఏపీఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రీడా మైదానంలో క్రీడలను ప్రా రంభించారు. ఈ సందర్భంగా గాల్లో బెలూన్స్ ఎగురవేశారు. అనం తరం 100 మీటర్ల పరుగు పందాన్ని ఆయన జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించి, మాట్లాడుతూ ఈ క్రీడలు రెండు రోజుల పాటు మహిళా ఉద్యోగులంతా తమ రోజువారీ విధులను పక్కనపెట్టి వయసుతో సంబం ధం లేకుండా పూర్తిగా నిమగ్నం కావాల



హాజరైన మహిళా ఉద్యోగులు

న్నారు. ఏపీఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నాలన్నారు. ప్రతి కుటుంబంలో ఒక వర్కింగ్ ఉమెన్ ఉంటే ఆ కుటుంబం ఆర్థికంగానే కాకుండా, ఇతర విషయాల్లోనూ సంతోషంగా ఉంటుందన్నారు. దీనిలో భాగంగా తల్లి గొప్పతనాన్ని గురించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఏపీఎన్జీ జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసు, జిల్లా కార్యదర్శి వెంకటకృష్ణ, ఏపీఎన్జీవో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రామానాయుడు, ఆశీర్వాదం, మహిళా విభాగం ఛైర్మన్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

'నన్నయ'లో రెండోరోజూ

ఉత్సాహంగా నారీఫెస్ట్

- సృజనాత్మకతను ప్రదర్శించిన మహిళలు



చిత్రలేఖనం పోటీలను పరిశీలిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రెండో రోజు బుధవారమూ ఉత్సాహంగా నారీఫెస్ట్ జరిగింది. ఈ పోటీలలో మహిళలు పాల్గొని సృజనాత్మకతను ప్రదర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్సిటీలోని ఉమెన్‌సెల్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. దీనిలో బాగంగా అనుబంధ కళాశాలల మహిళా సిబ్బందికి వివిధ పోటీలు నిర్వహించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జరిగిన చిత్రలేఖన పోటీలను వీసీ ప్రసన్నశ్రీ వీక్షించి వారిని అభినందించారు. అనంతరం మహిళల ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఉమెన్స్‌సెల్ కోఆర్డినేటర్ పి.ఉమామహేశ్వరిదేవి, అధ్యాపకులు ఎన్.సజనారాజ్, బి.విజయకుమారి, కె.రమణేశ్వరి, కె.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



సృజనాత్మక పోటీలో పాల్గొన్న మహిళలు

నేడు మహిళా దినోత్సవ వేడుకలు

వర్సిటీలో అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకలను గురువారం నిర్వహిస్తామని వీసీ తెలిపారు. నారీఫెస్ట్ విజేతలకు జ్ఞాపికలు, ధృవపత్రాలను అందజేస్తామన్నారు. మహిళలందరూ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'కోనసీమ'ను కోకో హబ్‌గా తీర్చిదిద్దేందుకు..

- కోకో సంఘం ఏర్పాటు

అమలాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాను కోకో హబ్‌గా తీర్చిదిద్దేందుకు నాంది పలుకుతూ కోనసీమ కోకో సంఘం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఉద్యాన, సహకార రిజిస్టర్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి సంఘం ఏర్పాటు విధి,విధానాలపై సమాలోచనలు జరిపారు. కోకో సంఘంలో అధ్యక్షుడిగా జాయింట్ కలెక్టర్, ఉపాధ్యక్షులుగా జిల్లా ఉద్యాన అధికారి, సభ్యులుగా జిల్లా మార్కెటింగ్‌శాఖ, జిల్లా పరిశ్రమల కేంద్ర, జిల్లా సహకార అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల నుంచి అడ్డాల గోపాలకృష్ణ, సరెళ్ల అప్పారావులను నియమిస్తామన్నారు. సంఘ రిజిస్ట్రేషన్ ఏర్పాట్లు ప్రారంభించాలన్నారు. క్లస్టర్‌లవారీగా కోకో పంటల విస్తరణకు జిల్లాలో ప్రాథమిక దశలో వెయ్యి ఎకరాలను గుర్తిస్తూ లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు. జిల్లాలో లక్ష ఎకరాల్లో కొబ్బరి తోటలు ఉన్నాయని, వీటిలో 50శాతం పాక్షిక నీడలో కోకో సాగుకు అనువైన ప్రాంతాలను ఎంపిక చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా రిజిస్టర్ నాగలింగేశ్వరరావు, జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ, జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంతో ...

నాకెంతో అనుబంధం

- సీనియర్ సినీ నటి జయప్రద
- కోటిలింగాల రేవులో సోదరుడి అస్థికల నిమజ్జనం



కోటిలింగాలరేవులో అస్థికలను నిమజ్జనానికి తీసుకువెళ్తున్న స్రామాట్, జయప్రద

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంతో తనకెంతో అనుబంధం ఉందని సీనియర్ నటి జయప్రద గుర్తు చేసుకున్నారు. బుధవారం తన సోదరుడు రాజబాబు అస్తికలను మేనల్లుడు స్రామాట్‌తో కలిసి కోటిలింగాల రేవులో బుధవారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆమె తన సోదరుడు స్రామాట్‌తో రాజమహేంద్రవరంలో ఉన్నప్పటి రోజులను గుర్తు చేసుకుని కన్నీరు పెట్టుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఈమెతోపాటు కుటుంబ సభ్యులు, తదితరులు ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో..

పోలీసులది కీలకపాత్ర

- కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్
- ముగిసిన సాయుధ దళాల వార్షిక మొబలైజేషన్



సాయుధ దళాల పరేడ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ బిందు మాధవ్

కాకినాడ క్రైం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణ, సమాజ సేవ, అసాంఘిక కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేయడంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుల కృషి, సహకారం ఎంతో కీలకమని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. కాకినాడ జిల్లా సాయుధ దళాల వార్షిక మొబలైజేషన్ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఇటువంటి శిక్షణల ద్వారా వృత్తి నైపుణ్యాలు పెంపొందడమే కాకుండా, శారీరక ధృడత్వంతో పాటు వ్యాయామం, ఆరోగ్యం లభిస్తుందన్నారు. మనమంతా శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలని కోరారు. సిబ్బంది శారీరక ధృఢత్వం, ఆయుధాలతో విన్యాసాలు, ఫైరింగ్, మాబ్ ఆపరేషన్‌లో నాణ్యమైన శిక్షణ పొందారని కితాబిచ్చారు. ముగింపు పరేడ్‌లో జిల్లా సాయుధ దళాలు నిర్వహించిన ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) ఎంజేవీ భాస్కరరావు, ఏఎస్పీ (ఏఆర్) శ్రీనివాసరావు, ట్రైనీ ఏఎస్పీ కుమారి సుస్మిత, ట్రైనీ డీఎస్పీ కుమారి జీవన, పరేడ్ కమాండర్ ఆర్ఎఆర్ నరసింహమూర్తి, ఆర్ఎంటీ వెంకట్రావు, సాయిధ దళాల ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్ట్

» జగ్గంపేటలో 492 కిలోల గంజాయి, రూ.2.78లక్షల నగదు స్వాధీనం

» పోలీసుల అదుపులో ఎనిమిదిమంది

» పరారీలో ఇద్దరు



జగ్గంపేటలో గంజాయితో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

జగ్గంపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేటలో గంజాయి రవాణా ముఠాను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం జగ్గంపేట పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌కు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు బుధవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో 492 కిలోల గంజాయిని తరలిస్తున్న ఎనిమిదిమందిని అరెస్టు చేశారు. వారిలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ముగ్గురు, కాకినాడ జిల్లాకు చెందిన ఒకరు, తమిళనాడుకు చెందిన ఇద్దరు, కర్ణాటకకు చెందిన మరో ఇద్దరు ఉన్నారు. జగ్గంపేటలోని జగనన్న కాలనీలో ఒక ఇంటిలో గంజాయిని స్వాధీనం చేస్తుకున్నట్టు ఎస్పీ తెలిపారు. ఏపీ31డీడీ4032 నంబరు గల కారులో 7 బస్తాల గంజాయి, ఇంట్లో 10 బస్తాల గంజాయి, రూ.2.78లక్షల నగదు, 7 సెల్‌ఫోన్‌లు, హీరోహోండా బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. 8 మంది నిందితులను అరెస్ట్ చేశారు. తమిళనాడుకు చెందిన మురుగన్, కర్ణాటకకు చెందిన శర్వన్ పరారీలో ఉన్నారు. నిందితులు గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు ఆధ్వర్యంలో సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన జగ్గంపేట ఎస్‌ఐ టి.రఘునాదరావు, గండేపల్లి ఎస్‌ఐ శివనాగబాబు, కిర్లంపూడి ఎస్‌ఐ జి.సతీష్, హెచ్ సీ సలీం, కానిస్టేబుల్స్ కృపారావు, బాలాజీ, సత్యనారాయణ, హోంగార్డులు అనీల్, వీరబాబు, సోమరాజు, సూరిబాబులను ఎస్పీ అభినందించారు.

తాళ్లరేవులో ఎనిమిది మంది...

తాళ్లరేవు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): యువకులకు గంజాయి సరఫరా చేసి వాటి ద్వారా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్న కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలానికి చెందిన మత్స్యకార యువకులను బుధవారం అరెస్ట్ చేసి వారి నుంచి 5,262 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపారు. వివరాల ప్రకారం.. గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురం గ్రామానికి చెందిన కర్రి వీర వెంకట సురేంద్ర అలియాస్ మ్యాఘ్బు, గిరి, పెదవలసలకు చెందిన చెక్కా రాజేష్ అలియాస్ రాజు, కోరింగ పంచాయతీ పెదబొడ్డువెంకటాయపాలెం కర్రి గంగాధర్, పాలెపు సతీష్, చిన బొడ్డువెంకటాయపాలెనికి చెందిన సంగాడి దుర్గామల్లేశ్వరరావు, కర్రి ఆదివిష్ణు, కాకినాడ అర్బన్ గోలీలుపేట, వెంకట్‌నగర్‌కు చెందిన వీరవెంకట సత్యనారాయణ అలియాస్ ఆటో నానిలు పెద్దాపురం పంచాయతీ అరకు వ్యాలీ మండలానికి చెందిన పాంగి గోవిందు, పాంగి డొంబులతో పరిచయం పెంచుకుని వారి ద్వారా గంజాయిని తరలిస్తూ తాళ్లరేవు మండలంలోని యువకులకు సరఫరా చేస్తున్నారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కోరింగ ఎస్‌ఐ ఆధ్వర్యంలో తాళ్లరేవు మండలం సీతారామపురంలో నాన్ లేఅవుట్ లో ఉన్న ఒక ఇంటి వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సీఐ చైతన్యకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

తునిలో ఇద్దరు..

తుని రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): 6 కిలోల గంజాయితో తునిలో నర్సీపట్నం బస్ స్టాప్‌లో గంజాయితో దిగి అక్కడ నుంచి రైలు మార్గం గుండా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. వారిని పరిశీలించగా 6 కేజీల గంజాయిని ప్యాకింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్టు గుర్తించారు.పట్టుబడిన బొడ్డు వరప్రసాద్, వెనిగళ్ళ పద్మపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరపరచనున్నట్టు సీఐ గీత రామకృష్ణ తెలిపారు. పద్మపై విజయవాడ భవానీపురం స్టేషన్లో, నంద్యాల జిల్లా ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నట్టు తెలిపారు. నిందితులు చాలా కాలంగా గంజాయి వ్యాపారం చేస్తున్నట్టు గుర్తించారు.



తాళ్లరేవు: నిందితులతో పోలీసులు

ప్రపంచ పర్యాటకుల గమ్యస్థానంగా ఏపీ

బెర్లిన్ సదస్సులో మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటకుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ని తీర్చిదిద్దడానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. జర్మనీలోని బెర్లిన్‌లో జరుగుతున్న ఐటీబీ బెర్లిన్-2025కు ఆయన హాజరైన విషయం తెలిసిందే. సదస్సులో రెండో రోజు ఏపీ పర్యాటకరంగంలో పెట్టుబడులకు అవకాశాలపై వరల్డ్ మీడియా ప్రతినిధులకు వివరించారు. పలువురు పెట్టుబడిదారులతో ప్రత్యేకంగా సమావేశమై ఏపీలోని పర్యాటక రంగంలోని అవకాశాలపై చర్చించారు. మంత్రి మాట్లాడుతూ దక్షిణ భారతదేశ పర్యాటకానికి ఏపీ ముఖ ద్వార మని చెప్పారు. ఏపీలో దాదాపు వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ విశాల సముద్రతీరం, సుం దర బీచ్‌లు, ఎత్తైన హిల్ ప్రదేశా లు, ప్రకృతి రమణీయ ప్రాంతాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు ఉన్నాయన్నారు. తిరుమలలోని వేంకటేశ్వర దేవస్థానం విశిష్టతను వివరించారు. అమరావతి, నాగార్జున కొంత వంటివి బుద్ధిజానికి ప్రతీకగా నిలిచాయన్నారు. గ్రామీణ పర్యాటకాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గిరిజనుల జీవన విధానాన్ని అరకు లోయ కళ్లకు కట్టినట్టు చూపిస్తోందన్నారు. వ్యర్థ ఘన పదార్థాల నిర్వహణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం ద్వారా పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రతకు పెద్ద పీట వేస్తున్నామని పేర్కొన్నారు.



బెర్లిన్‌లో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

రుణాలిప్పిస్తామని ఆశ జూపి మోసం

పోలీసులకు బాధితుల ఫిర్యాదు

ఇద్దరి అరెస్ట్

కాకినాడ క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రుణాలిప్పిస్తామని నమ్మబలికి.. తలో రూ.5 వేలు ముందు కట్టించుకున్నారు. ఆపైన రుణాలిప్పించకుండా మొహం చాటేయడంతో బాధితులు పోలీసులు ఆశ్రయించడంతో నిందితులను కాకినాడ త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి జైలుకి తరలించారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పనసపాడుకు చెందిన కందికట్టు శిరీష (ప్రియాంక) ఇన్‌ఫినిట్ పేరుతో కాకినాడ డైయిరీఫారమ్ సెంటర్‌లో కార్యాలయం నిర్వహిస్తోంది. కొన్నేళ్లుగా ఈ గ్రూపు పేరుతో రుణాలు ఇప్పిస్తామని, ముందుగా తలో రూ.5వేలు చెల్లిస్తే లోన్లు మంజూరు చేయిస్తానని నమ్మబలికింది. ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు చెక్కులు తీసుకుని రూ.5వేలు ఫీజు వసూలు చేసింది. డబ్బులు కట్టించుకోవడం తప్పించి, రుణాలు ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతుంది. దాంతో మోసపోయామని భావించిన బాధితులు బుధవారం కాకినాడ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు డైరీఫారం సెంటర్‌లో గల ఇన్‌ఫినిట్ కార్యాలయంపై దాడి చేశారు. నిర్వాహకురాలు శిరీష, ఆమెకు సహకరిస్తున్న చెట్ల సూర్యవెంకట రమణను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆ వ్యక్తి ఎవరు?

» బైపాస్‌రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసుపై దర్యాప్తునకు 5 బృందాలు

» రాష్ట్రవ్యాప్తంగా మిస్సింగ్ కేసులపై ఆరా

» స్వయంగా పర్యవేక్షిస్తున్న కాకినాడ ఎస్పీ

గొల్లప్రోలు రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులో పోలవరం కాలువ చెంతన గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురైన సంఘటనపై దర్యాప్తు కోసం 5 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. బైపాస్‌రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి మరణించి ఉండగా పోలీసులు గుర్తించిన సంగతి తెలిసిందే. ఎక్కడో హత్య చేసి ఇక్కడకు తీసుకువచ్చి పడవేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. బుధవారం రాత్రి వరకూ మృతుడు ఎవరనే విషయంలో ఎటువంటి క్లూ పోలీసులకు లభించలేదు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఏఎస్పీ మనీష్ దేవరాజ్‌పాటిల్ స్వయంగా సంఘటనా స్థలాన్ని పరిశీలించడంతో పాటు దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలతో కూడిన 5 బృందాలను ఏర్పాటు చేశారు. కత్తిపూడి- పిఠాపురం మధ్య గల అన్ని సీసీ టీవీల ఫుటేజీలను పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి నెలతో పాటు ఇప్పటివరకూ అదృశ్యమైన సంఘటనలకు సంబంధించి మిస్సింగ్ కేసుల వివరాలను సేకరిస్తున్నారు. మృతుడి చేతికి ఉన్న రాగి కడియం ఒక్కటే కేసుకు ఆధారంగా ఉంది. కాగా బుధవారం మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, ట్రైనీ ఐపీఎస్‌లు ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. వారి వెంట పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

బంధువుల ఇంటికొచ్చి.. అంతలోనే మరణించి!

హైవేపై గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



అన్వేష్ (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రాజానగరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక యువకుడు మృతిచెందాడు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలంలో శ్రీకృష్ణపట్నం గ్రామానికి చెందిన యేలేటి అన్వేష్ (22) బుధవారం రాజానగరంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి మోటార్‌సైకిల్‌పై రాజమ హేంద్రవరం వెళ్తున్న క్రమంలో హైవేపై గైట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోకి వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి తలపై నుంచి వెళ్లిపోవడంతో తలభాగం నుజ్జు నుజ్జయ్యి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించే దిశగా చర్యలు చేపట్టారు. మృతుడి తండ్రి యేలేటి దుర్గారావుకు ఇద్దరు కుమారులు. కాగా అవి వాహితుడైన అన్వేష్ గ్రామంలోనే కులవృత్తి చేస్తూ తండ్రికి ఆసరాగా ఉంటుండగా, చిన్న కుమారుడు దొరబాబు డిగ్రీ చదువుకుంటున్నాడు. అందివచ్చిన కొడుకు అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంపై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతదేహాన్ని పంచనామా అనంతరం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆసుపత్రి వద్దకు చేరుకుని వైద్యులను సంప్రందించి త్వరిత గతిత పోస్టుమార్టం పూర్తిచేసే దిశగా సహకారాలు అందించారు.

ఉపాధి కూలీ మృతి

బిక్కవోలు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రంగాపురం గ్రామానికి చెందిన ఉపాధికూలీ మేడిశెట్టి గోవిందమ్మ(65) మృతి చెందింది. ఏపీవో అగస్టీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోవిందమ్మ బుధవారం గ్రామంలోని ఇంజనీరు పొలం నుంచి వంత కాలువ పూడికతీత పనులకు వెళ్లి పనిచేస్తూ 10 గంటల సమయంలో కళ్లు తిరిగి పడిపోయింది. దీంతో తోటి కూలీలు ఆమెను ఇంటికి చేర్చారు. కుటుంబసభ్యులు ఆమెకు స్థానిక ఆర్‌ఎంపీతో ప్రథమ చికిత్స చేయించి అనపర్తి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం 2 గంటలకు మృతి చెందింది.



రంగాపురంలో ఉపాధి పనులు చేస్తూ కళ్లు తిరిగిపడిపోయిన గోవిందమ్మ

వా(హా)ట్సాప్.!

● తొలిసారిగా పదో తరగతి హాల్ టిక్కెట్లు వాట్సాప్ ద్వారా డౌన్లోడ్



అమలాపురం రూరల్/కాకినాడ రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తొలిసారిగా వాట్సాప్ ద్వారా హాల్ టిక్కెట్లు డౌన్లోడ్ చేసుకునే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ కల్పించింది. గతేడాది వరకు విద్యార్థుల హాల్‌టిక్కెట్లు తపాలాశాఖ ద్వారా ఆయా పాఠశాలలకు బట్వాడా చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేకుండా సెల్‌ఫోన్‌లోనే హాల్ టిక్కెట్ డౌన్లోడ్ చేసుకునే సదుపాయం ఇప్పటికే ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చినట్టు డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా, కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు. వాట్సాప్, మన మిత్ర ద్వారా విద్యార్థులు హాల్ టిక్కెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చు.

ఎలా డౌన్లోడ్ చేసుకోవాలి?

విద్యార్థులు సెల్‌ఫోన్ ద్వారా 9552300009 నంబరుకు హాయ్ అనే సందేశాన్ని పంపితే సేవను ఎంచుకోండి అని వస్తుంది. దానిపై క్లిక్ చేసి ఎడ్యుకేషన్ సర్వీసు లేదా విద్యాసేవలు ఎంచుకోండని వస్తుంది. అక్కడ ఎస్ఎస్‌సీ హాల్ టిక్కెట్ అని నమోదు చేసి అప్లికేషన్ నంబరు, విద్యార్థి గుర్తింపు నంబరు, డేట్ ఆఫ్ బర్త్‌ను నమోదు చేసి స్ట్రీమ్‌ను సెలెక్ట్ చేయాలి. అనంతరం కన్ఫర్మ్ మీద క్లిక్ చేస్తే హాల్ టిక్కెట్‌ను వాట్సాప్ వస్తుంది. అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు డౌన్లోడ్ చేసుకున్న హాల్ టిక్కెట్‌లో విద్యార్థి పేరు, పుట్టినతేదీ, మీడియం, ఫోటోగ్రాఫ్ సంతకం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని డీఈవోలు పేర్కొన్నారు. హాల్ టిక్కెట్ వివరాల్లో ఏదైనా మార్పు ఉంటే వెంటనే ఆయా పాఠశాలల హెచ్ఎంలు డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్‌కు మెయిల్ ద్వారా సమాచారం పంపించాలని తెలిపారు. డౌన్‌లోడ్ అయిన హాల్ టికెట్‌లో విద్యార్థి వివరాలన్నింటినీ పరిశీలించుకుని ఏమైనా అభ్యంతరాలుంటే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి dir_govexams@yahoo.comకు ఈ-మెయిల్ ద్వారా పంపించాలని సూచించారు.

8న జాతీయ లోక్ అదాలత్

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

రాజమహేంద్రవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. ఆ రోజున ఉదయం 10 గంటల నుంచి రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రాపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, ప్రమాద, బ్యాంకు, ప్రీలిటిగేషన్, రాజీపడదగిన క్రిమినల్ కేసులకు రాజీ మార్గం ద్వారా పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

వచ్చే నెల 7 నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు

ఆత్రేయపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణ మహోత్సవాలు ఏప్రిల్ 7 నుంచి 13 వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఏప్రిల్ 8 స్వామివారి రథోత్సవం, కల్యాణోత్సవం, తీర్థ మహోత్సవం కార్యక్రమాలను తిలకించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. ప్రభుత్వం నోటిఫైడ్ ఫెస్టివల్ కావడంతో వివిధ శాఖల అధికారులు భక్తులకు సేవలు అందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గురువారం ఆర్డీవో పి.శ్రీకర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో తొలి దఫా సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలపై ఆర్డీవో సమీక్షించనున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు న్విహిస్తున్నట్టు ఉపకమిషనరు ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

25 నుంచి అధ్యయనోత్సవాలు...

స్వామివారి కల్యాణోత్సవాలకు ముందుగా అధ్యయనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ నెల 25వ తేదీ నుంచి 29 వరకు నిర్వహించనున్నారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించే ఉత్సవాల్లో హోమాలు, ద్రవిడ వేద పారాయణం, పల్లకి మహోత్సవం, గరుడ వాహనసేవ, సింహవాహన సేవ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు.

ఆ హామీ నెరవేర్చాకే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి

ఏఐఎస్‌టీఈఏ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు వరహాలదొర

దివాన్‌చెరువు, మార్చి5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన వాగ్దానం మేరకు జీవో నెంబరు 3కి ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం (ఏఐఎస్‌టీఈఏ) తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.వరహాలదొర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఈనెలలో ఇస్తామని మంత్రి లోకేశ్ శాసనమండలిలో ప్రకటించారన్నారు. అయితే సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు జరిపిన ప్రచారంలో యువతకు ప్రత్యేకమైన డీఎస్సీ ఇస్తానని, మెగా డీఎస్సీలో గిరిజనులకు జీవో నెంబరు 3 ప్రకారమే నియామకాలు చేపడతామని చెప్పారన్నారు. లేదా ప్రత్యామ్నాయం తీసుకువస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ జీవో ప్రకారం స్థానికంగా నివాసం ఉంటున్న గిరిజన యువతతోనే నూరుశాతం ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలన్నారు. దీనివల్ల గిరిజన తెగల్లో వారు ఉపయోగించే ప్రత్యేకమైన భాషను ఉపయోగించి విద్యార్థులకు బోధించవచ్చన్నారు. ఇచ్చిన హామీ మేరకు జీవో నెంబరు 3 ప్రకారం ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ చేపట్టాలని డిమాండ్ చేశారు.

భావనారాయణస్వామి సన్నిధిలో

సినీ నటి మీనాక్షి చౌదరి పూజలు

కాకినాడలో జన్మదిన వేడుకలు



సర్పవరంలో పూజలు చేస్తున్న మీనాక్షి చౌదరి, కాకినాడలో స్నాక్స్ పంచుతూ..

సర్పవరం జంక్షన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పురాతన పుణ్యక్షేత్రమైన కాకినాడ జిల్లా సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామిని బుధవారం సినీ నటి మీనాక్షి చౌదరి దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి చరిత్ర, ఆలయ విశిష్టతపై పండితులు వివరించారు. స్వామివారి దర్శనం అనంతరం భావనారాయణస్వామి చిత్రపటం, ప్రసాదాన్ని అందించారు. భావనారాయణస్వామి విశిష్టతను తెలుసుకుని స్వామివారిని దర్శించుకునేందుకు విచ్చేసినట్టు మీనాక్షి తెలిపారు. అలాగే కాకినాడలో బాలల సంరక్షణా కేంద్రంలో మీనాక్షి చౌదరి జన్మదిన వేడుకలు నిర్వహించుకున్నారు. కేక్ కట్ చేసి పిల్లలకు స్నాక్స్, స్వీట్స్ పంచి పెట్టారు.

భీమేశ్వరస్వామి ఆదాయం రూ.27.97 లక్షలు



హుండీలలో కానుకలను లెక్కిస్తున్న సేవకులు, సిబ్బంది

ద్రాక్షారామ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి హుండీలలో కానుకలను లెక్కించగా రూ.27,97,105 నగదు, 10గ్రాముల బంగారం సమకూరింది. అన్నదాన హుండీ ద్వారా రూ.90.186 ఆదాయం లభించింది. బుధవారం స్వామివారి హుండీలను దేవదాయ శాఖ ఉప కమిషనరు, మహాశివరాత్రి ఉత్సవ అధికారి డీఎల్‌వీ.రమేష్ బాబు పర్యవేక్షణలో సహాయ ఉత్సవ అధికారి, సహాయ కమిషనరు విజయలక్ష్మీ ఆధ్వర్యంలో స్వామివారి హుండీలను తెరిచి లెక్కించారు. 13 డిసెంబరు 2024 నుంచి బుధవారం వరకు సదరు మొత్తం ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనరు దుర్గాభవానీ తెలిపారు. కార్యక్రమంలో ముప్పనపల్లి గణేష్, నామా వెంకన్నబాబు, దవులూరి రామకృష్ణ, పెంకె సాంబశివరావు, అల్లం రామకృష్ణ, ఆళ్లబుజ్జి, నవీన్, కర్రా నాగేశ్వరరావు, అద్దంకి అర్జున్, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు ఉన్నారు.

గోవులను తరలిస్తున్న కంటెయినర్ అడ్డగింత

వాహనం సీజ్, పరారీలో డ్రైవర్

గోశాలకు పశువుల తరలింపు



పట్టుబడిన కంటెయినర్

రాజానగరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తున్న కంటెయినర్‌ను జాతీయ రహదారిపై రాజానగరం సమీపంలోని సూర్యారావుపేట దుర్గమ్మ గుడి వద్ద హిందు గోసేవా సమితి సభ్యులు బుధవారం అడ్డుకున్నారు. వాహన డ్రైవర్ కంటెయినర్‌ను ఆపకుండా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో లారీకి అడ్డుగా నిలిచి అద్దాలు ధ్వంసం చేసే క్రమంలో చేసేది లేక వాహన డ్రైవర్ పరారయ్యాడు. దీంతో విషయం తెలుసుకున్న రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గోసేవ సమితి సభ్యులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు డీఎస్పీ శ్రీకాంత్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని వివరాలు వెల్లడించారు. కంటెయినర్‌లో ఆవుల్ని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పరిశీలించగా 52 ఎద్దులు క్లోజ్డ్ కంటెయినర్‌లో బంధించబడి ఉన్నాయన్నారు. పశువుల తరలిస్తున్న వాహనానికి సంబంధించిన లభించిన బిల్లుల ఆధారంగా శ్రీకాకుళం జిల్లా నుంచి చిలకలూరిపేట సంతకు తరలిస్తున్నట్టు తెలుస్తోందన్నారు. వాహన డ్రైవర్ పరారీలో ఉన్నాడని, సంబంధిత యజమానితో ఫోన్‌లో సంప్రదించామన్నారు. కాగా క్లోజ్డ్ కంటెయినర్‌లో పశులను తరలించడం చట్టరీత్యా నేరమని, ఆర్డీవో ఆదేశాల మేరకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాహనాన్ని సీజ్ చేశారని, అలాగే వాహనంలో ఉన్న ఎద్దులను పశుసంవర్ధకశాఖ అధికారుల సూచనల మేరకు సీతానగరం మండలం బొబ్బిల్లంక వద్ద ఉన్న రీహేబిటేషన్ సెంటర్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేశామని, ఎద్దులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆరా తీస్తున్నామన్నారు.

పోలీసుల తీరుకు నిరసనగా ర్యాలీ

గోవుల రవాణా మాఫియాకు సహకరిస్తున్న రాజానగరం సీఐపై చర్యలు తీసుకోవాలంటూ హిందూ గోసేవా సమితి సభ్యులు బుధవారం రాజానగరంలో నిరసన ర్యాలీ చేపట్టారు. గత నెల 26న మహాశివరాత్రి రోజున రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో గామన్ బ్రిడ్జిపై గోవులను అక్రమంగా తరలిస్తున్న కంటె యినర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగిస్తే చర్యలు తీసుకోకుండా అక్రమ మాఫియాకు మద్దతుగా పోలీసులు సహకరించారని ఆరోపించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సీఐకు వ్యతిరేకంగా నినాదాలుచేసి వినతి అందజేశారు.



రాజానగరంలో ర్యాలీ చేస్తున్న హిందూ గోసేవా సమితి సభ్యులు

'60 ఏళ్లు నిండిన తర్వాత ఆశా కార్యకర్తలు పదవీ విరమణ చేయాలి'

జీజీహెచ్ (కాకినాడ), మార్చి5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు 60 ఏళ్లు నిండిన తర్వాత ప్రభుత్వ నిబంధనల మేరకు పదవీ విరమణ చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4,510 మంది ఆశా కార్యకర్తలు పలు పీహెచ్‌సీల్లో పనిచేస్తున్నారన్నారు. గతేడాది 2024లో 10 మంది ఆశాలు, 2025లో ఫిబ్రవరి వరకు 18 మంది పదవీ విరమణ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశాలపై ఆశా నోడల్ ఆఫీసర్లు, వైద్యాధికారులు 60 ఏళ్లు నిండిన వారి వివరాలను జిల్లా వైద్యఆరోగ్య కార్యాలయానికి పంపడం జరుగుతుందన్నారు. పదవీ విరమణ చేసిన వారికి రావాల్సిన రాయితీలు, ఆర్థిక లావాదేవీలు సత్వరంగా విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ఆన్‌లైన్‌లో డ్వాక్రా ఉత్పత్తుల అమ్మకాలు

● శ్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ధర్మేంద్ర



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ధర్మేంద్ర

అనపర్తి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలుచేసే విధంగా కృషి చేస్తున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ శ్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.ధర్మేంద్ర అన్నారు. బుధవారం అనపర్తిలోని వెలుగు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓఎస్‌డీసీ ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిపాజిట్ కామర్స్ విధానం ద్వారా ఆన్‌లైన్ అమ్మకాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. మహిళాశక్తి సంఘాల ద్వారా తయారు చేస్తున్న అనేక ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి స్పందన లభిస్తుందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 73,250 డ్వాక్రా సభ్యులు ఉన్నారని వీరికి 2004-25 ఆర్థిక సంవత్సరానికిగాను 435 కోట్ల రుణాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ, వ్యవసాయ పనిముట్లు, పాలు పాల పదార్థాల సంబంధించిన వ్యాపారులకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. 18నుంచి 60సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు డ్వాక్రా సభ్యులుగా చేరేందుకు అర్హులని అన్నారు. ఒక్కొక్క గ్రూపునకు లక్ష రూపాయల రుణసౌకర్యం కల్పిస్తున్నామన్నారు. సకాలంలో రుణాలు చెల్లించే గ్రూపులకు ప్రాధాన్యం ఉం టుందన్నారు. రుణాలు పెంపుదల కూడా ఉం టుందని దీనిని ప్రతి సభ్యురాలు గుర్తించుకోవాలని ఆయన సూచించారు. మేనేజర్ రాజు, ఏపీఎం వీరమల్లు రాజాబాబు పాల్గొన్నారు.



విద్యార్థినులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి

● జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ పీడీ విజయకుమారి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి5 (ఆంధ్రజ్యోతి) : బాలికలు విద్యలో రాణించడమే కాకుండా ఆత్మవిశ్వాసంతో ఉండాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ పీడీ కె.విజయకుమారి అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం గణేష్‌చౌక్ వద్దనున్న ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతిగృహంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా ఆత్మస్థైర్యం, స్వీయరక్షణ అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వీయ రక్షణ, సాధికారిత కల్గి ఉండడంపై అవగాహన కల్పించడం జరుగుతున్నదన్నారు. బాలికలు తమను తాము రక్షించుకునే నైపుణ్యాలను కల్గి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బి.శశాంక, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ముత్యాల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మహిళా దినోత్సవ పోటీలు

రాజమహేంద్రవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాలతో జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు భద్రత, హక్కుల సాధికారత, మహిళాచట్టాలు, ఫోక్సో, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపై వ్యాసరచన, పెయింటింగ్, ఉపన్యాసం పోటీలను పోలీసు అధికారులు నిర్వహించారు. అనంతరం మహిళా దినోత్సవ ప్రాధాన్యం, సమాజంలో మహిళల పాత్ర, రక్షణ, హక్కుల గురించి అవగాహ నకల్పించారు. మహిళలు/చిన్నారులు అత్యవసర సమయంలో సహాయంకోసం మహిళా రక్షక్ వాట్సాప్ 9493206006, చైల్డ్ లైన్ 1098, మహిళా హెల్ప్‌లైన్ 181, పోలీస్ హెల్ప్‌లైన్ 112, సైబర్ క్రైమ్ 1930లో సంప్రదించాలని సూచించారు.

సంప్రదాయాల్లో ఆధునిక వాది మధునాపంతులు



మధునాపంతుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ కవిత్వంతో అత్యంత నవీనుడైన అభినవాంధ్రకవి మధునాపంతులు అని సంస్కృత ఆచార్యులు ఏవీఎన్‌బీ శ్రీనివాసశర్మ అన్నారు. బుధవారం ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల, కళాగౌతమి ఆధ్వర్యంలో జరిగిన మధునాపంతుల జయంతి సభలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడుతూ ఆంధ్రమహోజ్వల చరిత్రను, మణిపూసల వంటి పద్యాలతో చక్కని మణిహారాన్ని గుచ్చి భాషామతల్లికి అలంకరించి ఆంధ్రులకే గుర్తింపు తెచ్చిన వారు మధునాపంతుల అన్నారు. సభకు తెలుగుశాఖాధిపతి పీవీబీ సంజీవరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ పురాణాల్లో కనిపించే దైవభక్తికి మారుగా దేశభక్తి ఆంధ్రపురాణంలో కనిపిస్తుందన్నారు. పిన్సిపాల్ డీవీ రమణమూర్తి, కోర్సు కో ఆర్డినేటర్ జి.శరత్‌బాబు, అధ్యాపకులు ఎస్.రాజ్‌కుమార్, పి.సుధా మాట్లాడారు. పలువురు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని ఎదుర్కోవడానికి లౌకికశక్తులు ఏకం కావాలి

● సీపీఐ కార్యవర్గసభ్యురాలు అక్కినేని వనజ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : దేశంలో మతోన్మాదాన్ని ఎదుర్కోవడానికి ప్రజాస్వామిక, లౌకికశక్తులు ఏకం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో మూడురోజులపాటు జరిగే సీపీఐ జిల్లాస్థాయి వర్క్‌షాపును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ ఏ పోరాటానికైనా సైన్యం అవసరం అని, కమ్యూనిస్టు పార్టీకి కార్యకర్తలే సైన్యం అని పేర్కొన్నారు. సమాజంలో కార్పొరేట్ శక్తుల దోపిడీ నుంచి శ్రామికవర్గాన్ని విముక్తం చేయడానికి పార్టీ కార్యకర్తలు సైద్ధాంతికంగా ముందుకుసాగాలని కోరారు. ముందుగా సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మూడురోజుల వర్క్‌షాపు వివరాలను తెలియజేశారు. ఈ వర్క్‌షాపులో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.కొండలరావు, కె.జ్యోతిరాజు, కె.శ్రీనివాస్, చింతలపూడి సునీల్, సప్ప రమణ తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ లక్ష్మీనరసింహ దేవస్థానం అధ్యాపక స్వామి కృష్ణమాచార్యులు మృతి



కోరుకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అధ్యాపక స్వామి కోరుకొండ ఆర్యవైశ్య రామాలయం ప్రధాన అర్చక స్వామి ఇరగవరపు కృష్ణామాచార్యస్వామి బుధవారం మధ్యాహ్నం విష్ణు ఐక్యం చెందారు. ఆయన పార్థీవ దేహాన్ని భక్తులు, శిష్యులు సందర్శనార్థం కోరుకొండ అగ్రహారం వీధిలో ఆయన నివాసం వద్ద ఉంచారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కర్రి లక్ష్మిసరోజ, కర్రివీర గణేష్, మాజీ సర్పంచ్ కటకం అన్నపూర్ణ, మాజీ ఎంపీటీసీ కటకం చలం, పలువురు గ్రామపెద్దలు, ఆర్యవైశ్య సంఘం, శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అధ్యాపక స్వాములు, అర్చకస్వాములు, ఉభయవేదాంత పండితులు, కృష్ణామాచార్యులు శిష్యబృందం ఆయనను కడసారి చూసి ఘనంగా నివాళులర్పించారు. కృష్ణామాచార్య స్వామిజీకి భార్య, కుమారులు ఉన్నారు.

డ్వాక్రా మహిళలను తీసుకురావొద్దు

సీతానగరం, మార్చి 5: గత ప్రభుత్వంలోలా బలవంతంగా డ్వాక్రా మహిళలను తీసుకురావొద్దని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. మంగళవారం రాత్రి 7 గం టలకు చినకొండేపూడి జీవీకే ఫంక్షన్ హాల్‌లో ఛలో పిఠాపురం జనసేన స న్నాహక ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరినీ బలవంతంగా తీసుకురావొద్దని, అభిమానంతో వచ్చేవారిని అడ్డుకోవద్దని అన్నారు. చలో పిఠాపురం జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు వచ్చిన ప్రతిఒక్కరి బాధ్యత జనసేన నాయకులు వీరమహిళలు తీసుకోవాలన్నారు. ఆవిర్భావ దినోత్సవ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. జనసేన నాయకులు పాల్గొన్నారు.

100 శాతం పన్నులు వసూలు చేయాలి

● సమీక్షా సమావేశంలో కమిషనర్ కేతన్ గార్గ్



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ కేతర్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులు 100 శాతం వసూలు చేయాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదే శించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయం సమావేశ మందిరంలో రెవెన్యూ విభాగం అధికారులు. సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పన్నుచెల్లింపుదార్ల సౌకర్యార్థం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉన్న ట్రెజరీ కౌంటరుకు అదనంగా నగరంలో 8చోట్ల ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశామని అందులో ఇళ్ల యజమానులు తమ పన్నులను చెల్లించవచ్చని తెలిపారు. నగరంలో పన్నుల చెల్లింపులపై ప్రజలకు అవగాహన కోసం మైక్ ద్వారా అనౌన్స్‌మెంట్ చేయిస్తున్నామని తెలిపారు. పన్నుల వసూళ్లు తక్కువగా ఉన్న సచివాయాలకు ప్రత్యేక అధికారులను నియమించామని వారు ప్రతి ఇంటి యజమానిని కలిసి పన్ను వసూల్ చేస్తారని అన్నారు. పన్ను చెల్లించని ఇళ్లకు అత్యవసర సర్వీసులు నిలిపివేస్తామని హెచ్చరించారు. సీటి చార్జీల వసూలుకు ఎమినిటీస్ కార్యదర్శులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఖాళీ స్థలాల యజమానులను గుర్తించేందుకు బోర్డులను ఏర్పాటు చేస్తున్నామని, అలాగే బోర్డులను ఏర్పాటు చేయడం ద్వారా 106 ఖాళీ స్థలాలకు పన్ను విధించి ఒక కోటి ఇరవై మూడు లక్షల రూపాయలు వసూల్ చేశామని, మరిన్ని ఖాళీ స్థలాలను గుర్తించేందుకు సిబ్బంది దిశా నిర్దేశం చేస్తామన్నారు. ఖాళీ స్థలాలు ఉన్న యజమానులు పన్నులు వేయించుకునేందుకు ముందుకు రావాలని, ఇప్పటికే పన్నులువేసి ఉన్న యజమానులు పన్నులు చెల్లించాలని ఆదేశించారు. అపార్టుమెంట్లు, షాపింగ్ మాల్స్ నిర్మాణం చేస్తున్నవారు వారికి విధించిన పన్నులు చెల్లించనిచో నిర్మాణాలు నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. షాపుల అద్దెలపై సమీక్షించారు. అద్దెలు చెల్లించని షాపులు వెంటనే సీజ్ చేయాలని, ఇప్పటికే సీజ్ చేసిన వాటిని వేలం వేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, రెవెన్యూ అధికారి -2 సీహెచ్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములు కావాలి

ప్రజలు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములు కావాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో సిటిజన్ ఫీడ్ బ్యాక్ తీసుకునేందుకు డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. కాలేజీ విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. నగరంలో ఇప్పటివరకు 23000 మంది ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు.

తొలి మహిళా చాంబర్ డైరెక్టర్‌గా కొయ్యన కుమారి



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో 1946లో చాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటివరకు మహిళా డైరెక్టర్లు ఎన్నిక కాలేదు. తొలిసారిగా రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ మహిళా వ్యాపారవేత్త కొయ్యాన కుమారి డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదర్శ మహిళగా కొయ్యాన కుమారి నిలిచారు. నగరంలో 20 ఏళ్లుగా వ్యాపారంలో ఉన్నారు. పతంజలి ఆయుర్వేదంలో డీలర్‌గా ఎదిగారు. అదేవిధంగా లయన్స్ క్లబ్‌లో జోన్ చైర్‌పర్సన్‌గాను, అలయన్స్ క్లబ్ గవర్నర్‌గా సేవలు అందించి ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్‌గా, కమిటీ చైర్‌పర్సన్‌గా సేవలు అందించారు. ఎన్నో వార్డులు, రివార్డులు సాధించారు. ఈసందర్భంగా కొయ్యాన కుమారి మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తేనే ఫలితం ఉంటుందని చెప్పారు. ఎన్ని ఆటుపోట్లు వచ్చిన తట్టుకుని నిలబడితేనే విజయం సాధించగలుగుతామని చెప్పారు. మహిళలకు మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.

లైన్‌మెన్ వెంకన్న దొరకు అవార్డు



ధవళేశ్వరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని ధవళేశ్వరం విద్యుత్‌శాఖ కార్యాలయంలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న సీహెచ్ వెంకన్నదొరను జాతీయ లైన్‌మెన్ దివాస్ సందర్భంగా అవార్డు అందించింది. ఉత్తమ సేవలకుగాను ఈ అవార్డును తూర్పుగోదావరిజిల్లా సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.తిలక్‌కుమార్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నక్కపల్లి శామ్యూల్ అందజేశారు. ధవళేశ్వరం విద్యుత్‌శాఖ బి.శ్రీనివాస్ అవార్డు పొందిన వెంకన్నదొరను అభినందిస్తూ విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసే వాడని, అందుకే అవార్డు అందుకున్నాడని ప్రసంశించారు. అనంతరం సేవలు అందిస్తున్న లైన్‌మెన్‌ల అందరికీ శాలువాకప్పి అభినందించారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ : ఉండవల్లి



మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, విద్యతోపాటు దేశ భవిష్యత్తు గురించి ఆలోచన చేయడం అలవర్చుకోవాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ సూచించారు. ఆనాటి ప్రధాని నెహ్రూ ఎంతో ముందు చూపుతో సామ్యవాదం గురించి ఆలోచనచేసి మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ఉండాలని భావించారని ఆయన అన్నారు. దురదృష్టవశాత్తూ, ప్రభుత, ప్రైవేటు రంగం ఆరోగ్యకర పోటీ వాతావరణంలో కష్టపడి పనిచేస్తే, మంచి ఫలితాలు వ స్తాయని ఆయన అన్నారు. అందరికీ సమాన హక్కులు, చేసిన పనికి సమాన వేతనం ఉండాలని, కనీస వేతనాన్ని కూడా ఖచ్చితంగా ప్రభుత్వం అమలుచేయాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రతిపాదించారని ఉండవల్లి పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ఆర్కే రామచంద్ర మాట్లాడుతూ ఉండవల్లి వంటి అనుభవజ్ఞులతో ప్రసంగాలు ఇప్పించడం వలన మంచి ప్రయోజనం ఉంటుందని, విద్యార్థులకు మంచి ఉత్తేజాన్ని పంచుతుందన్నారు. అధ్యక్షుడు ముళ్ళా మాధవ్ మాట్లాడుతూ ఉండవల్లి రాజకీయాల్లో ఉన్నత విలువలు పాటించి, అనువాదకుడిగా, వివిధ పార్టీల నేతలకు సూచనలందిస్తూ అందరికీ ఆదర్శంగా ఉంటున్నారని వివరించారు. అనంతరం ఉండవల్లిని పిన్సిపాల్ రామచంద్ర సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలుమ్ని ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ఆర్ భార్గవ్,ప్రధాన కార్యదర్శి గద్దే సుధాకర్, కోశాధికారి ఎస్.విజయలక్ష్మి, లెక్చరర్ బాబ్జి పాల్గొన్నారు.

గోదావరిలో డ్రెడ్జింగ్ పడవలు నిలుపుదల చేయాలని ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఇసుకతీత కార్మికులు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5(ఆంధ్ర జ్యోతి): గోదావరిలో డ్రెడ్జింగ్ పడవలను నిలుపుదలచేసి తమకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ బాధిత ఇసుకతీత కార్మికులు కలెక్టర్ కార్యాలయంవద్ద ధర్నా చేశారు. బుధవారం జరిగిన ధర్నాలో దళిత ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు చోళ్ళ రాజు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య(పీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రశాంతిని కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పడవల్లో గోదావరి మధ్యలోకి వెళ్లి ఇసుకను కార్మికులు బకెట్లలోకి ఎత్తుకుని నావలో నింపి దానిని రేవులోకి చేర్చడం ద్వారా ఉపాధి పొందేవారని, కానీ డ్రెడ్జింగ్ మొదలుపెట్టిన నాటినుంచి కార్మికులు పనులు లేక రోడ్డున పడ్డారని చెప్పారు. డ్రెడ్జింగ్ చేయడంవల్ల గోదావరిలో 340 అడుగుల లోతు గోతులు ఏర్పడ్డాయని భవిష్యత్‌లో గోదావరి లో నిర్మించే కట్టడాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే డ్రెడ్జింగ్ నిలుపుదలచేసి ఇసుక తీత కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్మికులు నాగేశ్వరరావు, సత్తిబాబు, కృష్ణ, దుర్గా, వెంకటలక్ష్మి, వీరవేణి, నాగమణి, డేవిడ్ రాజు, కార్మికులు పాల్గొన్నారు.

'రైతులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

రాజానగరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సంక్షేమంకోసం కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న పలు సంక్షేమ పథకాలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిం పిలుపునిచ్చారు. మండలంలో మల్లంపూడి, ముక్కినాడ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు ఈ-పంట, ఈ-కేవైసీ చేయించుకోవడం ద్వారా అన్నదాత సుఖీభవ, వ్యక్తిగత వ్యవసాయ పరికరాలు రాయితీపై పొందవచ్చన్నారు. ఉద్యానశాఖాధికారి దివ్యశ్రీ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ మొక్కలు ఉచితంగా ఇస్తున్నారని, పంటసాగు లాభదాయకతను, మార్కెటింగ్ సౌలభ్యాన్ని సకాలంలో చెల్లింపులు గురించి రైతులకు వివరించారు. ఆయిల్ పామ్ తోటలకు బిందు సేద్య పద్ధతిలో నీటిని అందించాలని సూచించారు. నీటిలో కరిగే ఎరువులను డ్రిప్ ద్వారా అందించ డం (ఫెర్టిగేషన్)పద్ధతిని పాటించడంవల్ల ఖర్చు ఆదాతోపాటు దిగుబడి పెరుగుతుందన్నారు. బిందు తుంపర సేద్య పరికరా లను ప్రభుత్వం రాయితీపై అందజేస్తుందని, రైతు సేవా కేంద్రాల్లో రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. మామిడి పండ్ల ఉత్పత్తిలో నాణ్యమైన అధిక దిగుబడులు ఇచ్చే రక్షణ కవచాలు 15వేల హెక్టారుకు ఇస్తామన్నారు. ఒక్క కవచం ఖరీదు రూ.2 కాగా రాయితీపై ప్రభుత్వం ఎంఐడీహెచ్ పథకం ద్వారా సంబంధిత బిల్ సమర్పించడంవల్ల 50శాతం రాయితీపై రూ.1కే అంద జేస్తున్నామన్నారు. హెచ్‌ఈవో అరవింద్ సాయి, జ్యోతి, శేఖర్, రైతులు పాల్గొన్నారు.

మెరుగైన సమాజం కోసం మహిళా సంక్షేమం

రాజమహేంద్రవరంకల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బుధవారం స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెరుగైన సమాజం కోసం మహిళా సంక్షేమం అనే అంశంపై సింపోజియం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డి.వీరమణమూర్తి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను గురించి చెబుతూ ప్రతీ ఆడపిల్ల సామాజిక అడ్డంకులను అధిగమించడానికి మానసిక స్థైర్యం, కృషి ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.కోమలి తన వృత్తిపరమైన అనుభవాలను విద్యార్థులతో పంచుకుంటూ విద్యార్థిని జీవితంలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యపాత్ర వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వైస్వర్ణశ్రీ, ఇతర సభ్యులతోపాటు మహిళా సాధికారత సెల్ కన్వీనర్ జి.కోట పాల్గొన్నారు.

ఆడపిల్లలు చట్టాలపై అవగాహన ఉండాలి

కడియం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని వాటిలో ఫోక్సో చట్టం ముఖ్యమైందని కడియం ఎస్ఐ బి.నాగదుర్గాప్రసాద్ తెలిపారు. ఈనెల 8న అంతర్జాతీయ దినోత్సవం పురస్కరించుకుని కడియం ఉన్నత పాఠశాల విద్యార్థినులకు వ్యాసరచన, చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి హెచ్‌ఎం రఫీయుద్దీన్ అధ్యక్షత వహించారు. స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ చదువు అసమానతలను దూరం చేస్తుందని, ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయినీలు లీలావతి, పద్మజ, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆల్ అమీర్ కాలేజీలో సక్సెస్ మీట్

రాజమహేంద్రవరంకల్చరల్ మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రకాశ్‌నగర్‌లో గల ఆల్ అమీర్ డిగ్రీ అండ్ పీజీ కాలేజీ 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రజతోత్సవ వేడుకలు కళాశాల ఆవరణలో బుధవారం సక్సెస్ మీట్ నిర్వహించారు. విద్యార్థులందరూ సక్సెస్‌మీట్‌లో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ బాసిన రాజేష్ మాట్లాడుతూ కళాశాల చైర్మన్ ఏపీ సిద్ధిక్,సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ ఐహెచ్ ఫారూఖీ సారథ్యంలో గతనెల 21న కళాశాల రజతోత్సవం ఘనంగా నిర్వహించామని, ఆ రోజున, 1999లో కళాశాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రి ఎన్ఎండీఫరూక్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో పాటు ప్రస్తుత రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ కూడా ఈ రజతోత్సవానికి విచ్చేశారని వివరించారు. 1999 నుంచి ఇప్పటివరకు డిగ్రీలో 3500 మంది విద్యార్థులు డిగ్రీ పూర్తిచేశారని, 2005లో ప్రారంభించిన పీజీ కోర్సుల ద్వారా ఇప్పటివరకు 3000 వేలమంది ఉత్తీర్ణులయ్యారన్నారు.

పరిశోధనాభివృద్ధికి కేంద్రం ప్రాధాన్యం

రాజానగరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పరిశోధనాభివృద్ధికి, ఆవిష్కరణలకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని స్టేక్ హోల్డర్స్ ఎంగేజ్‌మెంట్ అడ్వైజర్ శిశిర సాహూ పేర్కొన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో పరిశోధన, ఆవిష్కరణ అవకాశాల అన్వేషణ అనే అంశంపై కళాశాల అధ్యాపకులకు బుధవారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. జీజీయు సీఏవో కె.విజయ భాస్కరరాజు అధ్యక్షత జరిగిన సమావేశంలో శిశిర సాహూ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. 2025 బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లు కేటాయించిందన్నారు. ప్రైవేట్‌రంగం నేతృ త్వంలో పరిశోధనలకు రూ.20వేలకోట్లు కేటా యించాలని నిర్ణయిందన్నారు. నూతన ఆవిష్కరణలే భవిష్యత్‌ను తీర్చిదిద్దుతాయన్నారు. డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, టీవీ ప్రసాద్, రిజిస్ట్రార్ శర్మ, ప్రిన్సిపాల్స్ టి.జయా నందకుమార్, బాబు, కె.వల్లీమాధవి తదితరులు పాల్గొన్నారు.

వీరవరంలో ఆబోతును చంపి పూడ్చిపెట్టారు

● హైందవ సంఘాలు, వీరవరం గ్రామస్థుల ఆరోపణ

కడియం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కడియం మండలం వీరవరంలో కలియుగ దైవంగా పిలవబడే ఆబోతును కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చంపి శ్మశానవాటికలో పూడ్చిపెట్టారని గ్రామస్థులు, హైందవ సంఘాలు కడియం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. గత మూడేళ్లుగా ఒక ఆబోతు ప్రతీ ఇంటికీ తిరుగుతూ వారు పెట్టిన ఆహారాన్ని తింటూ జీవనం సాగిస్తుందన్నారు. బుధవారం ఉదయం 10గంటల సమయంలో మెయిన్‌రోడ్‌మీద తిరుగుతుండగా కొందరు వ్యక్తులు తమ ప్రాంతానికి తరుముకుంటూ తీసుకెళ్లి తాళ్లతో బంధించి చంపి పొట్టిలంక గ్రామంవద్ద శ్మశానవాటిక వద్ద పూడ్చి పెట్టినట్లు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి తగుచర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు అందించిన వారిలో జనసేన, బీజేపీ నాయకులు వీరవరం గ్రామస్థులు పాల్గొన్నారు.

తాడిపూడి బాధితులకు నష్ట పరిహారం

కొవ్వూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గోదావరిలో మునిగి మృతిచెందిన యువకుల కు టుంబాలకు రూ.ఐదులక్షల నష్టపరిహారాన్ని రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపా రు. మహాశివరాత్రి రోజున నియోజకవర్గంలోని తాళ్ళపూడి మండలం తాడిపూడికి చెం దిన ఐదుగురు యువకులు గోదావరిలోపుణ్యస్నానాల కోసమని వెళ్లి దురదృష్టవశాత్తు అం దులో పడి మృతిచెందారు. ఈ దుర్ఘటనపై సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, సంబంధిత శాఖల అధికారులకు తెలియజేశానన్నారు. దీనిపై సీఎం స్పందిస్తూ బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ నుంచి ఒక్కొక్క కుటుంబానికి రూ. 5 లక్షల నష్టపరిహారాన్ని బుధవారం విడుదల చేశారన్నా రు. సంఘటన జరిగిన వారం రోజుల్లోనే బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేష్, సంబంధిత శాఖల అధికారులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

చెత్త నుంచి సంపద కేంద్రం పరిశీలన

సీతానగరం, మార్చి 5: మండలంలోని చినకొండేపూడిలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని బుధవారం ఈవోపీఆర్డీ మూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేస్తూ తడి, పొడి చెత్తను వేరుచేసి వర్మీ కంపోస్టు తయారు చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు.

ఇంటర్ పరీక్షలకు 17 మంది గైర్హాజరు

రంగంపేట, మార్చి5 (ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీషు పరీక్షకు 455 మంది విద్యార్థులు హాజరయ్యారని, 17 మంది గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్‌సూపరింటెండెంట్‌లు బి.హేమ, ఎస్.మాధురి తెలిపారు. ఎ.పి.ఆర్.వి ప్రసాద్, ఎం.వి.ఎస్ కృష్ణ డీవోలుగా వ్యవహరించారని వారు తెలిపారు.

ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వలేదు

● ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపోలో వివిధ ఖాళీలను పేర్కొంటూ ఇటీవల సోషల్ మీడియాలో పోస్టు పెట్టారని, నిరుద్యోగులు మోసపోవద్దని ఆర్టీసీ జిల్లా అధికారిణి కె.షర్మిల అశోక తెలిపారు. ఈమేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీ కోసం తాము ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియా ప్రకటనలో ఎస్ఎస్‌సీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్, బీఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, ఏదైనా డిగ్రీ అర్హతలు కల్గినవారు దరఖాస్తు చేసుకోవాలని, ఒక మొబైల్ నెంబరు ఇచ్చి తమను సంప్రదించాలని అందులో వెల్లడించారని తెలిపారు. ఈ ప్రకటన ఆర్టీసీకి సంబంధించినదికాదని, తప్పుడు ప్రకటనలు, వదంతులు నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దని ఆమె కోరారు.

అధికార దుర్వినియోగంతోనే సీట్లు గెలిచారు

● స్వతంత్ర అభ్యర్థి జీవీ సుందర్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీఎం చంద్రబాబు అధికార దుర్వినియోగానికి పాల్పడి సీట్లు గెలిచారని స్వతంత్ర అభ్యర్థి జీవీ సుందర్ ఆరోపించారు. బుధవారం రాజమహేంద్రవరంలోని రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను 2004 నుంచి ఎన్నికలు ప్రక్రియ పరిశీలిస్తున్నానని ఏ ఎన్నిక కూడా ఇంత దారుణంగా జరగలేదన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన పేరాబత్తుల రాజశేఖరం మెజార్టీ రౌండ్, రౌండ్‌కి సేమ్ సంఖ్య ఎలా వచ్చాయని సుందర్ ప్రశ్నించారు. ఇది ప్రజావిజయం కాదన్నారు. 19వేల ఓట్లు చెల్లనివి పడ్డాయని వాటిలో జై టీడీపీ అని రాసినవి కొన్ని టిక్‌లు పెట్టినవి కొన్ని, రోమన్ సంఖ్యలు వేసినవి కొన్ని ఇలా ఉన్నాయని పట్టభద్రులైన వారు ఎవ్వరూ ఇలా చెయ్యరని అన్నారు. ఈ ఎన్నికలపై తాను కోర్టుకు వెళతానని చెప్పారు. అదేవిధంగా గ్రూప్-2 అభ్యర్థులకు అన్యాయం చేశారని అన్నారు. వారు ఓటు హక్కులు పొందడానికి ముందుకురాకపోవడంతో వారిపై ప్రభుత్వం కక్ష గట్టిందన్నారు. తనకు ఓట్లు వేసిన పట్టభద్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

నేడు గోకవరంలో జాబ్‌మేళా

గోకవరం, మార్చి5(ఆంధ్రజ్యోతి): గోకవరంలోని కోళ్ళ వీరాస్వామి డిగ్రీ కళాశాల్లో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పీ.వీ.వీ.ప్రసాద్ బుధవారం తెలిపారు. ప్రముఖ కంపెనీలైన ఫాక్స్ కాన్ మేన్యూఫ్యాక్చరింగ్, వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రవేట్ లిమిటెడ్, జేఎస్ సొల్యూషన్స్ కంపెనీలలో ఉద్యోగాల నియామకం కోసం ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైనవారు ఆసక్తి గల అభ్యర్థులు తమ కళాశాల్లో జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. వివరాలకోసం 9885270488లో సంప్రదించవచ్చని వివరించారు.

స్పీకర్‌తో ఎమ్మెల్యే నల్లమిల్లి భేటీ



స్పీకర్ అయ్యన్నపాత్రుడితో సమావేశమైన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర శాసనసభ సమావేశాల సందర్భంగా బుధవారం వెలగపూడిలోని స్పీకర్ చాంబర్‌లో పలువురు మంత్రులతో కలిసి స్పీకర్ అయ్యన్నపాత్రుడితో సమావేశమై పలు అంశాలపై చర్చించినట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో తనతోపాటు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, చేనేత జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత, ఫారెస్ట్ కార్పొరేషన్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావులు పాల్గొన్నట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి తెలిపారు.


'భరత్ రామ్ జోలికొస్తే సహించం'

రాజమహేంద్రవరంసిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ భరత్‌రామ్ జోలికి వస్తే సహించేదిలేదని వైసీపీ నాయకుడు బిల్డర్ చిన్నా అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌతమి సూపర్ బజార్ విషయంలో రూ.5 కోట్లు మార్గాని భరత్‌రామ్ తీసుకున్నారని ఆరోపించిన టీడీపీ నాయకులు దానిని నిరూపించగలరా అని ప్రశ్నించారు. మరో నాయకుడు సుందర్‌సింగ్ మాట్లాడుతూ పేపరు మిల్లు పరంపర స్కీమ్‌లో అవినీతి జరిగినప్పుడు చిటూరి ప్రవీణ్‌చౌదరి ఏ పార్టీలో ఉన్నారో టీడీపీ నాయకులకు తెలియదా అని ప్రశ్నించారు. ఎన్నికలకు ఏడాది ముందే వైసీపీలోకి వచ్చారని అన్నారు. అప్పటి నుంచి అతనిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు



బిక్కవోలు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామికి ప్రీతికరమైన షష్ఠి, జన్మనక్షత్రమైన కృత్తిక రావడంతో బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా స్వామికి పవమానసూక్తం అభిషే కం, హోమం జరిపారు. ఆలయ ఈవో ఆకెళ్ల బాస్కర్ పాల్గొన్నారు.



రంజాన్ వేళలు	ఇఫ్తార్ (గురు)	సా.6.20
	సహరి (శుక్ర)	ఉ.4.56

తాడిపూడి మృతుల బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం 8

చేనేత సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన గోరంట్ల



రాజమహేంద్రవరం మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత కార్మికుల పరిస్థితేంటి? వారి వృత్తి లాభదాయకంగా ఉందా, ఇబ్బందులు పడుతున్నారా? యంత్రాల రంగ ప్రవేశంతో చేతన కార్మికుల జీవన స్థితిగతులేంటి? వీరి విషయంలో ప్రభుత్వం దగ్గర ఏవిధమైన సమాచారం ఉంది, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం తీసుకునే చర్యలు ఏమిటని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అసెంబ్లీలో ప్రశ్నించారు. బుధవారం అసెంబ్లీ జీరో అవర్‌లో ఆయన సభ దృష్టికి ఈ సమస్యలను తీసుకువెళ్లారు. దీనిపై సంబంధిత మంత్రి స్పందిస్తూ చేనేత కార్మికుల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని, గత ప్రభుత్వంలో మరీ అధ్వానమైందని, వారిని ఆదుకోవాడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు ప్రకటించారు. పాత బాకీలు రద్దుచేయాలని, ఆప్కోను ప్రోత్సహించాలని గోరంట్ల కోరారు.

కమ్యూనిటీ హాళ్లను ఖాళీ చేయించాలని కోరిన ఆదిరెడ్డి



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో కమ్యూనిటీహాళ్లను సచివాలయాలుగా మార్చేశారని, వాటి అవసరం లేనిచోట్ల ఖాళీచేయించాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో టీడీపీ ప్రభుత్వం రాజమహేంద్రవరంలో పేదలు, బలహీనవర్గాల ప్రజలకు ఫంక్షన్లకు, ఇతర కార్యక్రమాలకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాళ్లను నిర్మించిందన్నారు. వాటిని వైసీపీ అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి గత ఐదేళ్లుగా ఈ కమ్యూనిటీ హాళ్లలో సచివాలయాలను ఏర్పాటుచేసిందన్నారు. జిప్లస్ వన్ కమ్యూనిటీ హాళ్లను కూడా తీసుకుని, పైనా కిందా సచివాలయాలు ఏర్పాటు చేసిందని, దీనివల్ల ప్రజలకు ఇవి అందుబాటులో లేకుండాపోయాయన్నారు. వీటిని అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

రయ్.. రయ్..



సామర్లకోట- వేమగిరి కెనాల్ రోడ్



రామచంద్రపురం- కరప - కాకినాడ రోడ్డు

- ఉమ్మడి తూ.గో. జిల్లాలో పీపీపీ విధానంలో రహదారుల అభివృద్ధి
- కాకినాడ-జొన్నాడ, కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్ రోడ్ల ఎంపిక
- వీటిని పీపీపీ విధానంలో అభివృద్ధికి నిర్ణయం
- సాధ్యాసాధ్యాలపై డీపీఆర్‌ల తయారీ బాధ్యత ఎల్ఎన్ మాలవ్య సంస్థకు అప్పగింత
- ఈ రోడ్లపై వాహన రద్దీ, ఎంత కాలానికి పీపీపీ అనేదానిపై ఏడాదిలో అధ్యయన నివేదిక
- కాకినాడ-జొన్నాడ రహదారి అభివృద్ధికి రూ.225 కోట్లు ఖర్చవుతుందని అంచనా
- కరప, వేళంగి, ఆలమూరు, మండపేటలలో బైపాస్‌లు నిర్మాణంతో భారీగా పెరగనున్న ఖర్చు
- అటు కెనాల్ రోడ్డు అభివృద్ధికి రూ.160 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా
- అన్నీ కుదిరితే వచ్చే ఏడాదే ఈ రహదారుల నిర్మాణానికి టెండర్లు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అత్యంత కీలకమైన కాకినాడ-జొన్నాడ, కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్ రహదారులకు మంచి రోజులు రాబోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ రెండు రహదారులపై నిత్యం వేలల్లో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. తీరా ఇవి అత్యంత ఇరుకైన రహదారులు కావడంతో నిత్యం ట్రాఫిక్ నరకంతోపాటు ప్రయాణ సమయం చాలా ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఈ రెండింటిని పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వీటి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి నివేదిక తయారుచేసే బాధ్యతను తాజాగా ఎల్ఎన్ మాలవ్య కంపెనీకి అప్పగించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు పట్టణాలు, నగరాలు, జాతీయ రహదారిని కలిపే అనేక కీలక రహదారులు గడచిన అయిదేళ్లలో పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఏమాత్రం అభివృద్ధికి నోచుకోక ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. ఒకపక్క భారీ గుంతలు పడ్డా గత వైసీపీ సర్కారు వీటిని గాలికి వదిలేసింది. దీంతో ప్రజలు పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక రహదారులను కోట్లు ఖర్చుచేసి మరమ్మతులు చేసింది. అయితే వీటిలో అత్యంత కీలకమైన రోడ్లను మాత్రం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని, వీటికయ్యే ఖర్చును ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా భరించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు రహదారులను ఎంపిక చేసింది. వీటిలో ఒకటి కాకినాడ-జొన్నాడ, మరొకటి కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్ రోడ్డు. 62 కిలోమీటర్ల పొడవున్న కాకినాడ- జొన్నాడ రహదారి ఉమ్మడి జిల్లాలో అత్యంత కీలకం. కాకినాడ జిల్లా నుంచి కోనసీమ జిల్లాకు అనుసంధానించే ఈ రహదారి ద్వారా రావులపాలెం జాతీయ రహదారికి చేరుకోవచ్చు. అయితే ఈ రోడ్డు కాకినాడ నగరం నుంచి కరప, వేళంగి, రామచంద్రపురం, మండపేట, ఆలమూరు మీదుగా వెళ్తుంది. నిత్యం ఈ రోడ్డు భారీగా రద్దీగా ఉంటుంది. రావులపాలెం, విజయవాడ, హైదరాబాద్ వెళ్లే బస్సులు, కార్లు, ఇతర లారీలన్నీ ఈ దారి మీదుగానే ప్రయాణిస్తాయి. కానీ ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన ఈ రహదారి ఇప్పుడున్న ట్రాఫిక్‌ను ఏమాత్రం తట్టుకోలేని విధంగా మారింది. రోడ్డు ఎక్కడికక్కడ చాలా చిన్నది కావడంతో వచ్చిపోయే వాహనాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. ఈ ఆర్అండ్‌బీ రహదారిని పీపీపీ విధానంలో భారీస్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అటు 50 కిలోమీటర్ల పొడవు న్న కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్ రోడ్డు సైతం ఈ రెండు నగరాలను కలిపే కీలక రహదారి. ఒక రకంగా ఏడీబీ రోడ్డుతో పోల్చితే కెనాల్ రోడ్డు ద్వారా రెండు నగరాల మధ్య దూరం తక్కువ. ప్రస్తుతం లారీలు, కార్లు, బస్సులు ఇతర వాహనాలన్నీ ఈ రోడ్డుపై నుంచే వెళ్తున్నాయి. మధ్యలో అనేక గ్రామాలు, పట్టణాలు ఉండడంతో ట్రాఫిక్ దారుణంగా ఉంటోంది. రహదారి చాలా ఇరుగ్గా ఉండడంతో నిత్యం నరకమే. దీంతో దీన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

వచ్చే ఏడాదిలోగా పనులు..

ఈ రెండు రహదారులను పీపీపీ విధానంలో భారీగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి నిర్మాణ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయించడానికి సిద్ధమైంది. ఈమేరకు ప్యాకేజీ 3 కింద డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించడానికి టెండర్లు పిలిచింది. వీటిని తాజాగా మధ్యప్రదేశ్‌కు చెంది ఎల్ఎన్ మాలవ్య సంస్థ ఈ కాంట్రాక్టు దక్కించుకుంది. త్వరలో ఈ రెండు రహదారుల అభివృద్ధి ఈ కంపెనీ పూర్తిస్థాయి నివేదిక తయారు చేయనుంది. అందులోభాగంగా ఈ రోడ్లను అభివృద్ధి చేసే విషయంలో సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయనుంది. ఆయా రోడ్లపై వాహనరద్దీ ఎంత ఉంది అనేదానిపై కొంతకాలం పరిశీలించనుంది. ఈ రోడ్లను అభివృద్ధి చేస్తే ఎంత కాలానికి పీపీపీ విధానంలో కాంట్రాక్టర్‌కు అప్పగించవచ్చు.. టోల్ వసూలెంత చేయాల్సి ఉంటుంది.. రహదారిని నిర్మించిన తర్వాత టోల్ ద్వారా కాంట్రాక్టర్‌కు వెచ్చించినంత మొత్తం రాకపోతే ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ద్వారా ఎంత చెల్లించాలి? తదితర అంశాలపై డీపీఆర్‌లో ఈ కంపెనీ వివరించనుంది. ఈ నివేదికను వచ్చే ఏడాది ఈ సంస్థ ప్రభుత్వానికి అప్పగించనుంది. ఆ తర్వాత రోడ్లను విస్తరించి కొత్తగా నిర్మించడానికి టెండర్లను పిలవనుంది. కాకినాడ-జొన్నాడ రహదారిలో ఇప్పటికే పలు పట్టణాలు, గ్రామాలు భారీగా విస్తరించినందున నాలుగులేన్ల కొత్త రహదారి అభివృద్ధికి భూములు, ఇళ్లు సేకరించాల్సి వస్తుందని, అదే జరిగితే ఖర్చు భారీగా ఉంటుందని అంచనాకు వచ్చారు. ఈనేపథ్యంలో కరప, వేళంగి, మండపేట, ఆలమూరు మీదుగా కొత్తగా బైపాస్‌లు నిర్మించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇందుకు రూ.225కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. అలాగే కెనాల్ రోడ్డుకు సైతం నాలుగు రహదారులు నిర్మించాల్సి రావడం, అటు అనపర్తి, వేమగిరి పట్టణాల మీదుగా రహదారి వెళ్తుండడంతో వీటిని బైపాస్ చేస్తూ కొత్తగా రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉంది. అలాగే కేశవరం,వేట్లపాలెం, బ్రహ్మదేవం ప్రాంతాల్లో కాలువ, రైల్వే ట్రాక్, రోడ్డు పక్కపక్కనే ఉన్నాయి. ఈనేపథ్యంలో వీటి వద్ద కూడా బైపాస్ అవసరం. మిగిలిన రహదారి వెంబడి కాలువ ఉండడంతో భూసేకరణకు పెద్దగా ఖర్చు కాదు. అయితే ఈరోడ్డును అభివృద్ధి చేయాలని ఇప్పటికే కూటమి అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబును కలిపి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పలు దఫాలుగా వినతిపత్రం అందించారు. దీంతో పీపీపీ విధానంలో ఈ రోడ్డు చేర్చారు. అయితే కెనాల్ రోడ్డుకు రూ.160 కోట్ల కంటే ఎక్కువ వ్యయం అవుతుందని అధికారులు అంచనాకు వచ్చారు.

ఎంపీ లాడ్స్ తీయరేమి..

- రూ.5 కోట్లు ఉన్నా పనుల్లో జాప్యం
- ప్రతిపాదనలు పంపిన ఎమ్మెల్యేలు
- మళ్లీ రెండో విడత వచ్చేస్తోంది
- ఇప్పటికైనా శ్రద్ధ పెడతారా..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సాధారణంగా అభివృద్ధి పనులకు నిధుల కొరత వేధిస్తుంది. కొన్ని సందర్భాల్లో పనులు ముగించినా బిల్లులు పెండింగ్‌లో ఉండే పరిస్థితులు ఉంటాయి. కానీ ఎంపీ ల్యాడ్స్ నిధులు వాటికి పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. చేతిలో డబ్బులు ఉన్నా చేతల్లో జాప్యం వల్ల అభివృద్ధి పనులకు ఖర్చు కావాల్సిన ఎంపీ ల్యాడ్స్ నిధులు ఉపయోగపడడానికి నెలల తరబడి ఎదురుచూపులు చూస్తున్నాయి. ఎమ్మెల్యేల నుంచి ప్రతిపాదనలు ఎంపీ కార్యాలయానికి ఎప్పుడో అందినా ఎంతో తర్జనభర్జన అనంతరం మొదటి అడుగు ఇప్పుడు పడింది. మళ్లీ ఏప్రిల్ నెల వస్తే రెండో విడత నిధులు కూడా జమ అవుతాయి. అభివృద్ధి పనుల్లో వేన్నీళ్లకు చన్నీళ్ల మాదిరిగా ఉపయోగపడాల్సి నిధులు నిద్రావస్థలో ఉన్నాయి. పోనీ ఎక్కడా అభివృద్ధి పనులు అవసరం లేదా? అనుకుంటే.. రోడ్లు, డ్రైన్లు వంటి కనీసం అవసరాలు కూడా లేని ఊర్లు చాలానే ఉన్నాయి. ఎంపీ ల్యాడ్స్ నిధుల విడుదల జాప్యంపై ప్రత్యేక కథనం..

● ఎంపీ ల్యాడ్స్ అంటే?

ప్రతి పార్లమెంట్ సభ్యుడు/సభ్యురాలికి తన నియోజకవర్గ పరిధిలోని అభివృద్ధి పనులు చేసుకోడానికి కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాదీ రూ.5 కోట్ల నిధులు ఇస్తుంది. వీటిని మెంబర్ ఆఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డవలప్‌మెంట్ స్కీం(ఎంపీఎల్ఏడీఎస్) అంటారు. వీటితో ప్రజలకు ఉపయుక్తంగా ఉండే పనులు మాత్రమే చేయాల్సి ఉంటుంది. వ్యక్తిగత అవసరాలకు తావుండదు. ఏదైనా వేరే నిధులకు మ్యాచింగ్ గ్రాంటుగా కూడా వీటిని వాడుకోవచ్చు. అంటే ఉదాహరణకు ఓ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.50 లక్షలు అంచనా వేస్తే.. ఆ పనికి నిధులు రూ.40 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదల అయితే.. ఎంపీ ల్యాడ్స్ నుంచి మిగతా రూ.10 లక్షలు ఇవ్వవచ్చు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సీసీ రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ హాల్స్. ఇలా ప్రజావసరార్థం ఆ నిధులను వినియోగించాలి. గతంలో కలెక్టర్ అకౌంట్‌కి ఈ నిధులను జమ చేయడం జరిగేది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'ఈ-సాక్షి' పోర్టల్ ద్వారా నిధులు ఇస్తున్నారు. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన కొద్ది రోజుల్లోనే రూ.5కోట్లు ఆ పోర్టల్‌లో జమ అవుతాయి. ఆయా ఎమ్మెల్యేలు, సంస్థల నుంచి వచ్చే అభ్యర్థలను పరిశీలించి ఎంపీ కేంద్ర ప్రభుత్వ లాగిన్‌లో తన అంగీకారాన్ని తెలుపుతారు. అక్కడి నుంచి కలెక్టర్‌కి ఆ పనుల జాబితా వస్తుంది. వాటి అవసరతపై మళ్లీ పరిశీలన చేసిన తర్వాత సంబంధిత ప్రభుత్వశాఖలు అంచనాలు తయారుచేసి టెండర్లు పిలుస్తాయి. 1993-94 బడ్జెట్‌లో రూ.5 లక్షల చొప్పున మొదలైన ఈ కేటాయింపులు 94-95లో రూ.కోటి, 98-99లో రూ.2 కోట్లు, 2011-12 నుంచి రూ.5కోట్లు ఇస్తున్నారు. ప్రతి ఏడాదికి రూ.5కోట్లు చొప్పున ప్రతీ ఎంపీకి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంది. ఇవి ఒకవేళ ఆ ఏడాదిలో ఉపయోగించకపోతే మరుసటి ఏడాదికి జమ అవుతాయి. ఇలా ఖర్చు చేయకుండా ఉన్న నిధులు తర్వాత వచ్చే ఎంపీలు వినియోగించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అంటే.. ఇప్పుడు అధికారంలో ఉన్న ఎంపీలు ఖర్చు చేయకపోతే తర్వాత అధికారంలోకి వచ్చే ప్రభుత్వం, అప్పటి ఎంపీకి ఆ ఘనత దక్కినట్టు అవుతుంది.

● ఇంకా పైసా ఇవ్వలే..

రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పురందేశ్వరి విజయం సాధించిన కొద్ది రోజులకే ఈ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ఎంపీ ల్యాడ్స్ వచ్చేశాయి. అంటే ఎంపీ ల్యాడ్స్ రూ.5కోట్లు వచ్చి సుమారు 6 నెలలు గడిచింది. కానీ ఇప్పటికీ పైసా ఖర్చు చేయలేదు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గంలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. నిడదవోలు, రాజానగరం జనసేన ఎమ్మెల్యేలు, అనపర్తి బీజేపీ, మిగతా చోట్ల టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే రూ.80లక్షలు, రూరల్ ఎమ్మెల్యే సుమారు రూ.50 లక్షలకు ప్రతిపాదనలు పంపించారు. రాజానగరం, నిడదవోలు, గోపాలపురం ఎమ్మెల్యేలు కూడా ఎంపీ ల్యాడ్స్ కోసం అర్జీలు పంపారు. చివరిగా అనపర్తి, కొవ్వూరు వెళ్లాయి. అయితే ఇప్పటివరకూ ఎవరికి ఎంత?, ఏ పనికి ఇవ్వాలనే మీమాంసలోనే కాలం గడిపేశారు. ఆ వడపోత అనంతరం నియోజకవర్గానికి రూ.60 లక్షల చొప్పున కేటాయించినట్లు తెలుస్తోంది. వాటికి సంబంధించి ఎంపీ ల్యాడ్స్ లాగిన్‌లో ప్రక్రియ రెండు రోజుల క్రితమే పూర్తయినట్లు సమాచారం. అంటే తదుపరి ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభం కావడానికి ఇంకా రెండు నెలలు పడుతుంది. ఈలోపు రెండో విడత ఎంపీ ల్యాడ్స్ నిధులు జమవుతాయి. అయితే సార్వత్రిక ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వాలు కొలువుదీరడం, కుదురుకోడానికి సమయం పట్టడం వల్ల ఎంపీ ల్యాడ్స్ ఖర్చు చేయడానికి సమయం పట్టినట్లు తెలుస్తోంది. ఎంపీ ల్యాడ్స్ నిధులను రూ.5కోట్ల నుంచి రూ.25కోట్లకు పెంచాలని గతంలో యాన్యువల్ రిఫామ్స్ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసినా.. ఇచ్చిన నిధులనే మురగబెడుతున్నారనే కారణంతో ఆ సిఫారసులను తిరస్కరించడం గమనార్హం.

పీడీఎస్ బియ్యం వేలం

రాజమహేంద్రవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ 6ఏ కేసుల్లో సీజ్ చేసిన 47.274 టన్నుల పీడీఎస్ (రేషన్ బియ్యం) బియ్యాన్ని గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్‌లో నిల్వ చేశామని జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు తెలిపారు. వాటికి కిలో రూ.30 చొప్పున ధర నిర్ణయించామని, ఈనెల 11న ఉదయం 11 గంటలకు అక్కడే బహిరంగ వేలం నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనవచ్చని, జీఎస్టీ లైసెన్స్ కలిగి ఉండాలని రూ.2 లక్షలు జాయింట్ కలెక్టర్, తూరుగోదావరి పేరున డీడీ రూపంలో ధరావత్తుగా చెల్లించాలని పేర్కొన్నారు.

నేడు గీతకార్మిక కులాలకు మద్యం షాపుల కేటాయింపు

రాజమహేంద్రవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గీతకార్మిల కులాలకు మద్యం షాపుల కేటాయింపునకు గురువారం ఉదయం 10 గంటలకు సబ్‌కలెక్టరేట్లో లాటరీ పక్రియ నిర్వహిస్తున్నారు. లాటరీలో ఎంపికైన వారికి మద్యం షాపులను కేటాయిస్తారు. 2024-26 మద్యం పాలసీలో భాగంగా కూటమి ప్రభుత్వం గీత కార్మిక కులాలకు 10 శాతం మద్యం దుకాణాలను ప్రకటించిన విషయం తెలిసిందే. దీని ప్రకారం జిల్లాలో 13 షాపులు వారికి కేటాయించాల్సి ఉంది. దీనిలో శెట్టిబలిజకు 11, గౌడ, గౌడ్‌కు ఒక్కోటి చొప్పున కేటాయిస్తారు. 13 షాపులకు సంబంధించి శెట్టిబలిజ నుంచి 330, గౌడ 9, గౌడ్ కులస్తుల నుంచి 48 దరఖాస్తులు అందాయి.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, సినీనటుడు బాలాజీ తదితరులు

అంబులెన్స్‌ను ప్రారంభించిన కలెక్టర్ ప్రశాంతి

ధవళేశ్వరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థకు ఈసీఈ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన అంబులెన్స్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం తన కార్యాలయం వద్ద ప్రారంభించి స్వచ్ఛంద సంస్థకు అందజేశారు. ఈ సందర్భంగా పార్డ్ ఇండియా అందిస్తున్న సేవలను కొనియాడుతూ సంస్థ ఫౌండర్ వీవీ బీవీ స్వామిని అభినందించారు. గోపాలపురం నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాల్లో అవసరమైన వారికి ఉచిత అంబులెన్స్ సర్వీసును ప్రారంభించడంపై హర్షం వ్యక్తంచేశారు. సినీనటుడు బాలాజీ, పార్డ్‌ఇండియా జాతీయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, మహ్మద్ ఇలియా షరీఫ్, సీహెచ్ కృష్ణప్రసాద్, యానాపు ఏసు, బి.రామారావు పాల్గొన్నారు.

రొయ్య.. రోదన!



- పడిపోయిన రొయ్యల ధరలు
- పంట చేతికివచ్చే సమయంలో.. భారీగా తగ్గుదల
- ఎగుమతిదారుల సిండికేట్‌తో రైతులు విలవిల
- పెరిగిన ఉత్పత్తి వ్యయం.. కుదేలవుతున్న ఆక్వారంగం
- నాణ్యతలేని సీడు, పెరిగిన విద్యుత్ చార్జీలు, ఫీడ్ ధరలు
- కాలుష్య కారకాలుగా మారుతున్న ఆక్వా చెరువులు
- ప్రభుత్వమే ఆక్వాను ఆదుకోవాలి : రైతుల డిమాండ్



అమలాపురం/అంతర్వేది, మార్చి5(ఆంధ్రజ్యోతి): విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిపెట్టే ఆక్వారంగం క్రమంగా కుదేలవుతోంది. పెరుగుతున్న పెట్టుబడి వ్యయానికి తగ్గట్టు ఉత్పత్తి అయిన రొయ్యలకు సరైన లభించకపోవడంతో ఆక్వా రైతులు నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ఎగుమతిదారులు సిండికేట్‌గా తయారై ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అయ్యే సమయానికి ధరలను ఇష్టారాజ్యంగా తగ్గించేయడంతో ఆ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికితోడు నాణ్యతలేని రొయ్య సీడు సరఫరా, విద్యుత్ చార్జీల భారం, ఆక్వా ఫీడ్ ధరల పెరుగుదలతోపాటు ఉత్పత్తి వ్యయాలు అనూహ్యంగా పెరిగిపోతుండడంతో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని ఆక్వా సేద్యం చేస్తున్న రైతులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. దీనికితోడు రొయ్యల చెరువుల లీజు కూడా రికార్డుస్థాయికి చేరిపోయింది. కానీ ఆక్వా పంట విక్రయించే సమయంలో మాత్రం ఎగుమతిదారులు పెట్టిందే రేటు.. వారు కొంటేనే రైతుకు దిక్కు అన్న చందంగా పరిస్థితులు మారిపోతున్నాయి. దీంతో రానున్న రోజుల్లో ఆక్వా సేద్యం గడ్డు పరిస్థితులను ఎదుర్కోనుంది. ఆక్వా సేద్యం చేస్తున్న రైతులకు రొయ్య పిల్లల సీడ్ చెరువులో వేసిన నాటి నుంచి అది పెరిగి పెద్ద అయి కౌంట్ దశకు చేరే సమయం వరకు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. గతంకంటే భిన్నంగా సాగు సమయంలో అనేక కష్టాలు పడాల్సి వస్తోంది. ఒకవైపు విపరీతంగా పెరిగిపోతున్న ఆక్వాచెరువులు. మరోవైపు కాలుష్యం కారకాలుగా ఆ ప్రాంతాలు తయారు కావడంతో చెరువుల సాగుకు అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల వల్ల రొయ్యలు, చేపలపై వివిధ రకాల వైరస్‌లు దాడి చేస్తున్నాయి. ఫలితంగా ఆ పంటలు సాగుచేస్తున్న ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికి కారణం హేచరీల్లో నాణ్యత లేని సీడును ఉత్పత్తిచేసి మాయమాటలతో రైతులను బురిడీ కొట్టించి వాటిని సరఫరా చేయడం ద్వారా భారీ సొమ్ము చేసుకుంటున్నారు. వీటికితోడు పెరిగిన విద్యుత్ చార్జీలు, అడ్డూ అదుపులేకుండా ఆక్వాసేద్యానికి సంబంధించిన ఎరువులు, వ్యాక్సిన్లు, మేత రేట్లు పెంచి రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని ఆక్వా రైతులు ఆరోపిస్తున్నారు. పంట సాగుకు వచ్చే సమయంలో ముఖ్యంగా ఆక్వారంగానికి చెందిన ఎగుమతిదారులు సిండికేట్‌గా మారి ధరలు అమాంతంగా తగ్గించడంతో పంట దిగుబడి, రొయ్య కౌంట్ ధరలపైనా ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు వారు ఇస్తున్న షాక్‌తో నష్టం వాటిల్లుతోంది. గతేడాది మే నెలలో వంద కౌంట్ ధర కిలో రూ.220 పలికేది. అయితే ఆ కౌంట్ సాగు చేయడానికి రూ.250 పైనే ఖర్చు అవుతుందని ఆక్వా రైతులు చెబుతున్నారు. గత ఏడాదిలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కిలో కౌంట్ రొయ్య ధర రూ.260 వరకు పెరిగింది. ఒక దశలో వంద కౌంట్ రూ.270 కూడా కొనుగోలు చేశారు. ఈ ధర కొన్ని నెలలపాటు నిలకడగా కొనసాగడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. అయితే గత కొన్ని రోజులు నుంచి క్రమంగా వీటి ధరలు తగ్గుముఖం పట్టాయి. మహాశివరాత్రి పర్వదినం నుంచి రొయ్యల ధరలు పతనం ప్రారంభమై వంద కౌంట్ ధర రూ.200కు పడిపోయింది. ఎగుమతిదారులు సిండికేట్ అయి పండుగల పేరిట రొయ్యల ధరలను తగ్గిస్తూ తమ జీవితాలతో ఆడుకుంటున్నారని ఆక్వాసాగు చేస్తున్న వందలాదిమంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి



ప్రస్తుతం ఉన్న ఆక్వా రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంతో ఎదురుచూశాం. అయితే ఒక్కసారిగా మూడ్రోజుల్లో రూ.30 ధర తగ్గడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సీడులో నాణ్యత లేకపోవడం, విద్యుత్ చార్జీలు, రొయ్య మేత ధర పెంపుపై రైతులను ఎగుమతిదారులు తీవ్ర ఇక్కట్లకు గురిచేస్తున్నారు. చిన్నాపెద్దా ఆక్వా సాగు చేసుకునే రైతులకు సరైన నాణ్యత గల సీడు, సరఫరాచేసి ఉత్పత్తి సమయంలో ధరలను నిలకడగా ఉంచితే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.

- నల్లా సత్యకిరణ్‌ప్రసాద్, ఆక్వా రైతు, అంతర్వేది

ధరల్లో రోజురోజుకు క్షీణత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆక్వారంగ ఉత్పత్తుల ధరల పెరుగుదల చూపించినట్టే చూపి హఠాత్తుగా వాటిని తగ్గించేశారు. దాంతో ఈ ఏడాది ఫిబ్రవరి 20న ఉన్న ధరలతో పోలిస్తే మార్చి మొదటి వారంలో ఇప్పటివరకు రూ.150 తగ్గించేశారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రతీ కౌంట్‌కు కిలోకు సగటున రూ.30 వరకు ధర తగ్గించారు. ప్రతీ రైతుకు ఎకరానికి కనీసం రూ.లక్ష వరకు నష్టం వాటిల్లితున్నట్టు రైతులు వాపోతున్నారు. కాగా ఫిబ్రవరి 20న వంద కౌంట్ రూ.260 ఉండగా, 90 కౌంట్ రూ.270, 80 కౌంటు రూ.300, 70 కౌంట్ రూ.330, 60 కౌంట్ రూ.360, 50 కౌంట్ రూ.390, 40 కౌంట్ రూ.415 పలికేది. అయితే మార్చి 1వ తేదీన నుంచి 3వ తేదీ వరకు వంద కౌంట్ రూ.250 నుంచి రూ.230కి పడిపోయింది. 40 కౌంట్ రూ.400 నుంచి రూ.380కు పడిపోయింది. కానీ రైతుల నుంచి మాత్రం ఇంకా ధరలు తగ్గించి దళారులు తక్కువకు కొనుగోలు చేయడం వల్ల భారీగా నష్టపోతున్నారు.

దుద్దుకూరులో రామాలయ పునఃనిర్మాణం



గ్రామంలో నూతనంగా పునఃనిర్మించిన రామాలయం

దేవరపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): దుద్దుకూరులో రూ. రెండు కోట్లతో సీతారామ స్వామి వారి ఆలయాన్ని పునఃనిర్మించారు. ఈ నెల 6వ తేదీ గురు వారం నుంచి 9వ తేదీ వరకు పునఃప్రతిష్ఠ మహాకుంభాభిషేక మహోత్సవాలను ఘనంగా నిర్వ హిస్తున్నట్టు చాగల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన రావిపాటి వరప్రసాద్ సిద్ధాంతి తెలిపారు. ఆలయంలో ఉపాలయాలతో పాటు గోపురం చుట్టూ పలు దేవతా రూపాలను సుందరంగా తీర్చిదిద్దారు. ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా యాగశాలను ఏర్పాటు చేసిన మహిళలు ముగ్గులతో ప్రత్యేకంగా అలంకరించారు. 6వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా శోభాయాత్ర గ్రామ దేవత ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మ వార్లకు పసుపుకుంకుమ, చీర, సారె, పానకం ఆలయ కమిటీ వారిచే సమర్పించి పూజా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ మహో త్సవాల్లో భాగంగా 6 నుంచి 9వ తేదీ వరకు ప్రత్యేకహోమాలు, పూజాకార్యక్రమాలు నిర్వ హించటం జరుగుతుందని, 9వ తేదీన భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.

కార్నియా సేకరణ



కార్నియాను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

తాళ్లపూడి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : సృష్టిలోని ప్రతి జీవికి కంటిచూపు ప్రధానమైనది. అందుకే సర్వేంద్రియనాం నయనం ప్రధానం అంటారు. అటువంటి కంటి కార్నియాలను సేకరించి అంధులకు చూపును ఇవ్వడం చాలా గొప్ప విశేషం. వివరాల్లోకి వెళితే మలకపల్లికి చెందిన గద్దే సూర్యకాంతం (88) బుధవారం ఉదయం మృతిచెందింది. ఈ విషయాన్ని నిడదవోలు శ్రీరాజేశ్వరి రామకృష్ణన్ లైన్స్ కంటి వైద్యశాల వైద్య సిబ్బందికి తెలపగా, వారు గ్రామానికి విచ్చేసి ఆమె కార్నియాను సేకరించి హైదరాబాదులోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి తరలించారు. ఆమె కుటుంబ సభ్యులు జయరామకృష్ణ, వెంకటలక్ష్మి, స్థానిక లైన్స్ క్లబ్ సభ్యులు మద్దుకూరి శ్రీనివాస్ ఉన్నారు.

జలజీవన్ మిషన్ బోర్‌వెల్ పనుల పరిశీలన

తాళ్లపూడి, మార్చి (ఆంధ్రజ్యోతి): జల జీవన్ మిషన్‌లో భాగంగా వేగేశ్వరపురం పంచాయతీకి మంజూరైన బోర్‌వెల్ పనులను బుధవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు ఆధ్వర్యంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ బోరుతో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా గ్రామ ప్రజల నీటి కష్టాలు తీరనున్నాయన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పరశురామారావు, కార్యదర్శి నాగాంజనేయులు అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు.



బోర్‌వెల్ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ పరశురామారావు, కార్యదర్శి నాగాంజనేయులు

నేడు మద్యం షాపులకు డ్రా

కొవ్వూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కల్లుగీత కులాలకు కేటాయించిన 13 మద్యంషాపులకు సంబంధించి ఈ నెల 6వ తేదీన డ్రా తీస్తున్నట్టు కొవ్వూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీ. సత్యనారాయణ తెలిపారు. ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశపు మందిరంలో కొవ్వూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని తాళ్ళపూడి, చాగల్లు మండలాలకు కేటాయించిన రెండు మద్యం షాపులకు డ్రా తీయడం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులు గోదావరి రైల్వేస్టేషన్ వద్ద గల సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్ణీత సమయానికి హాజరుకావాలని ఆయన తెలిపారు.

దేవరపల్లి: దేవరపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో రెండు షాపులకు గురువారం ఉదయం 10 గంటలకు రాజ మండ్రిలో లాటరీ ద్వారా ఎంపిక చేస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ బళ్లా శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన దేవరపల్లి సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతూ దేవరపల్లి మండలంలో ఒక షాపు శెట్టిబలిజ సామాజిక వర్గానికి కేటాయించగా, మొత్తం 39 దరఖాస్తులు వచ్చాయన్నారు. అలాగే గోపాలపురం మండలానికి సంబం ధించి ఒకషాపును శెట్టిబలిజ వర్గానికి కేటాయించగా, 43 దరఖాస్తులు అందాయని తెలిపారు. దేవరపల్లి, రాజమండ్రి ఆనం కళా కేంద్రంలో డ్రా తీస్తామని తెలిపారు. తప్పని సరిగా దరఖాస్తు చేసుకున్నవారు ఎంట్రీ పాస్‌లు తీసుకుని రావాలని సూచించారు.

'డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలి'



స్థానికులతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర

చాగల్లు, మార్చి 5, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ కాలనీలో క్వారీ గోతిలో గల కాలనీ డంపింగ్ యార్డు వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని చెత్తతోపాటు పక్క గ్రామంలోని చెత్తను కూడా ఈ డంపింగ్ యార్డులో వేయడం వల్ల తీవ్ర దుర్గంధం వస్తోందని వారంతా వాపోతున్నారు. అలాగే చెత్తకు నిప్పు పెట్టడం వల్ల తీవ్రమైన పొగ వ్యాపించి పరిసర ప్రాంతాల లోని ఇళ్లల్లో ఉండేవారు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కాలనీ వాసులు స్థానిక బీజేపీ నాయకులకు తెలియజేయడంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర బుధవారం వచ్చి డంపింగ్ యార్డును సందర్శించారు. సమ స్యను పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలకు వినతిపత్రాలు అందజేస్తానని వారికి హామీ ఇచ్చారు. బీజేపీ మండల అధ్యక్షుడు తాళ్లూరి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యర్నగూడెంలో వాటర్ పైపు లీకేజీ

• గుంతలమయంగా మారుతున్న రోడ్డు

దేవరపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ వాటర్‌పైపు లీకై యర్నగూడెంలోని నాలుగురోడ్ల సెంటర్‌లో నీరు నిల్వ ఉండిపోవడంతో గోతుల మయంగా మారింది. దీంతో వాహనచోదకులు, బాటసారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రెండునెలల నుంచి ఇదే తంతు కొనసాగుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నిత్యం నిడదవోలు నుంచి జంగారెడ్డిగూడెం, ఏలూరు నుంచి రాజమండ్రికి వేలాది మంది వాహనాల్లో ప్రయాణిస్తుంటారు. నాలుగురోడ్ల సెంటర్‌లో గోతులు పడ టంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు రోడ్డు నిర్మించారు. పంచాయతీ పైపు లీకవడంతో ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమవుతుంది.



నాలుగు రోడ్ల సెంటర్‌లో రోడ్డుపై గోతులు

● పంచాయతీ అధికారులు పైపులీకై రోడ్డు పాడవుతుందని రెండునెలలుగా చెబుతున్నా.. పెడచెవిన పెడుతున్నారని, దీని వల్ల రోడ్డు పాడవటంతో వాహనచోదకులకు ఇబ్బంది కలుగుతుందని, వెంటనే పంచాయతీ అధికారులు లీకేజీని అరికట్టాలి.

- బొల్లిన భాస్కర్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు, యర్నగూడెం.

చైతన్య స్కూల్‌లో డ్రాయింగ్ పోటీలు



విద్యార్థులకు మహిళా దినోత్సవం గురించి వివరిస్తున్న హెడ్ కానిస్టేబుల్ విజయశ్రీ

దేవరపల్లి, మార్చి5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక చైతన్యస్కూల్‌లో విద్యార్థినులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఎస్ఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. విజేతలకు మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని ఆయన చెప్పారు.

పీడీఎస్ బియ్యం వేలం

రాజమహేంద్రవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ 6ఏ కేసుల్లో సీజ్ చేసిన 47.274 టన్నుల పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్‌లో నిల్వ చేశామని జేసీ చిన్న రాముడు తెలిపారు. వాటికి కిలో రూ.30 చొప్పున ధర నిర్ణయించామని, ఈనెల 11న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి గలవారు జీఎస్టీ లైసెన్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు.

టూరిజం గమ్యస్థానంగా ఏపీ

● బెర్లిన్ సదస్సులో మంత్రి కందుల దుర్గేశ్

రాజమహేంద్రవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటకుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ని తీర్చిదిద్దడానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషిచేస్తున్నారని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. జర్మనీలోని బెర్లిన్‌లో జరుగుతున్న ఐటీబీ బెర్లిన్- 2025కు హాజరైన విషయం తెలిసిందే. సదస్సులో రెండోరోజు ఏపీ పర్యాటక రంగంలో పెట్టుబడులకు అవకాశాలపై వరల్డ్ మీడియా ప్రతినిధులకు ఆయన వివరించారు. పలువురు పెట్టుబడిదారులతో ప్రత్యేకంగా సమావేశమై అవకాశాలపై చర్చించారు. మంత్రి మాట్లాడుతూ దక్షిణ భారతదేశ పర్యాటకానికి ఏపీ ముఖద్వారమని చెప్పారు. దాదాపు వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ విశాల సముద్రతీరం, సుందర బీచ్‌లు, ఎత్తైన హిల్ ప్రదేశాలు, ప్రకృతి రమణీయ ప్రాంతాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు ఉన్నాయన్నారు. అలాగే తిరుమలలోని వేంకటేశ్వర దేవస్థానం గురించి వివరించారు. అమరావతి, నాగార్జున కొండ వంటివి బుద్ధిజానికి ప్రతీకగా నిలిచాయన్నారు. గ్రామీణ పర్యాటకాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. గిరిజనుల జీవన విధానాన్ని అరకులోయ కళ్లకు కట్టినట్టు చూపిస్తోందన్నారు. వ్యర్థ, ఘన పదార్థాల నిర్వహణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం ద్వారా పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నామని మంత్రి వెల్లడించారు.



బెర్లిన్ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి దుర్గేశ్

తాడిపూడి బాధిత కుటుంబాలకు ..

రూ. 5 లక్షల నష్ట పరిహారం

● సీఎంఆర్‌ఎఫ్ నిధుల నుంచి విడుదల చేసిన సీఎం చంద్రబాబు ● కృతజ్ఞతలు తెలిపిన టీడీపీ నాయకులు



ఆర్డర్ కాపీని చూపిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గోదావరిలో మునిగి మృతిచెందిన యువకుల కుటుంబాలకు రూ. ఐదులక్షల నష్టపరిహారాన్ని రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. మహా శివరాత్రి రోజున నియోజకవర్గంలోని తాళ్ళపూడి మండలం తాడిపూడికి చెందిన ఐదుగురు యువకులు గోదావరిలోపుణ్యస్నానాల కోసమని వెళ్లి దురదృష్టవశాత్తు అందులో పడి మృతిచెందారు. ఈ దుర్ఘటనపై సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, సంబంధిత శాఖల అధికారులకు తెలియజేశానన్నారు. దీనిపై సీఎం స్పందిస్తూ బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ నుంచి ఒక్కొక్క కుటుంబానికి రూ. 5 లక్షల నష్టపరిహారాన్ని బుధవారం విడుదల చేశారన్నారు. సంఘటన జరిగిన వారం రోజుల్లోనే బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేష్, సంబంధిత శాఖల అధికారులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

ధన్యవాదాలు తెలిపిన స్థానిక నాయకులు

తాళ్లపూడి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి రోజున తాడిపూడిలో చోటుచేసుకున్న ప్రమాదానికి సంబంధించి మృతిచెందిన కుటుంబాలకు కూటమి ప్రభుత్వం రూ. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ఆదుకోవాలని సీఎం దృష్టికి తీసుకెళ్లగా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఒక్కొక్క కుటుంబానికి రూ. ఐదు లక్షలు చొప్పున ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసినట్టు తెలిపారు. దీనిలో భాగంగా స్థానిక టీడీపీ నాయకుడు నామా కొండబాబు, మండల కాపు నాడు సేవా సమితి నాయకుడు నామన బుల్లిరాజు సీఎంకు, ఎమ్మెల్యేకు బాధిత కుటుంబాల తరఫున ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీ సీనియర్ నేత సత్యం మృతి



పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

పెరవలి, మార్చి5(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి అగ్రహారం మాజీ ఎంపీటీసీ సభ్యుడు, నిడదవోలు నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు అబ్బిశెట్టి సత్తిరాజు తండ్రి అబ్బిశెట్టి సత్యం (83) వృద్ధాప్యంతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బూరుగుపల్లి శేషారావు కొత్తపల్లి అగ్రహారానికి చేరుకుని సత్యం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట అతికాల రామకృష్ణమ్మ, సలాది కృష్ణమూర్తి, బొడ్డు రామాంజనేయులు, సలాది శ్రీహరి, నల్లాకుల వెంకటేశ్వరరావు, బండారు బాబి , తదితరులు ఉన్నారు.


మహిళా ప్రజాప్రతినిధులకు సత్కారం



మహిళా ప్రజాప్రతినిధులను సత్కరిస్తున్న దృశ్యం

నిడదవోలు, మార్చి5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు చిలకల శారదాదేవి, ఆలమూరి భారతీను బుధవారం ఘనంగా సత్కరించారు. ప్రెసిడెంట్ జల్లూరి నాగ పుష్పావతి, సెక్రటరీ కందగట్ల భాగ్యలక్ష్మి, ట్రెజరర్ బోనగిరి పద్మజ, ప్రగళ్ళపాటి పద్మశ్రీ, కొలపర్తి వనిత, తదితరులు పాల్గొన్నారు.

గుబ్బాలమ్మ హుండీ ఆదాయం రూ. 2,26,356



అమ్మవారి హుండీని లెక్కిస్తున్న దృశ్యం

నిడదవోలు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గోపవరంలోని గుబ్బాలమ్మ అమ్మవారి దేవస్థానం హుండీలను బుధవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖాధికారుల సమక్షంలో లెక్కించారు. దాదాపు 98 రోజులకు రూ. 2,26,356 ఆదాయం లభించినట్టు ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాశరావు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులతో పాటు గ్రామస్తులు ఏ. చిననంగాలు, పి.దుర్గా ప్రసాద్, అడ్డగర్ల కృష్ణ, వి.సూర్యచంద్రరావు, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరుగా తడి, పొడిచెత్తను సేకరించాలి



వేలివెన్నులో మాట్లాడుతున్న డీఎల్‌పీవో అమ్మాజీ

ఉండ్రాజవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించాలని కొవ్వూరు డీఎల్‌పీవో అమ్మాజీ పేర్కొన్నారు. బుధవారం వేలివెన్నులో నియోజవర్గంలోని ఉండ్రా జవరం, పెరవలి, నిడదవోలు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ల నిర్వహణ గురించి ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది చెత్త సేకరణ సమయంలో తడి, పొడి చెత్త, వర్మీకంపోస్టు తయారీ గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. రిసోర్స్‌పర్సన్ మొహిద్దీన్ వర్మీ కంపోస్టు తయారీ, వానపాములు ఎప్పుడు విడుదల చేయాలనే దానిపై శిక్షణ ఇచ్చారు. ఈవోపీఆర్డీ కె. ఆంజనేయ శర్మ, గ్రామసర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, ఉపసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంట దిగుబడిలో సమగ్ర సస్య రక్షణే కీలకం

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాధవరావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాధవరావు

నల్లజర్ల, మార్చి5 (ఆంధ్రజ్యోతి): పంటల దిగుబడిలో సమగ్ర సస్యరక్షణే కీలకమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాధవరావు అన్నారు. సమగ్ర సస్య రక్షణ పద్ధతులపై రెండు రోజుల శిక్షణను బుధవారం తెలికిచర్ల కల్యాణ మండపంలో పురుగుల మందు డీలర్లు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బందికి అందించారు. ఈ సందరంగా ఆయన మాట్లాడుతూ చీడపీడల నిర్మూలనకు రైతుల అందుబాటులో ఉన్న అన్ని సమగ్ర యాజమాన్యపు వనరులను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఏరువాక కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు మాట్లాడుతూ అధికంగా పురుగు మందుల వినియోగం వల్ల పర్యావరణం కాలుష్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ పూర్తి గోస్వామి, వీపీవో డాక్టర్ కేవీ చౌదరి, ఏపీవో పేద రంజితం, ఏవో కమల్‌రాజ్, ఉద్యాన శాఖ అధికారిణి బబిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మహిళా దినోత్సవ పోటీలు



పోటీల్లో విద్యార్థులు

రాజమహేంద్రవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థినులకు భద్రత, హక్కుల సాధికారత, మహిళా చట్టాలు, పోక్సో, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపై వ్యాసరచన, పెయింటింగ్, ఉపన్యాస పోటీలను పోలీసు అధికారులు నిర్వహించారు. మహిళలు / చిన్నారులు అత్యవసర సమయంలో సహాయం కోసం మహిళా రక్షక్ వాట్సప్ 9493206006, చైల్డ్‌లైన్ 1098, మహిళా హెల్ప్‌లైన్ 181, పోలీస్ హెల్ప్ లైన్ 112, సైబర్ క్రైమ్ 1930లో సంప్రదించాలని సూచించారు.

8న జాతీయ లోక్ అదాలత్



కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో మాట్లాడుతున్న జడ్జి అనురాధ

కొవ్వూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో ఈ నెల 8వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఇందులో క్రిమినల్, సివిల్, మెయింటెనెన్స్, గృహహింస కేసులు, మోటారు వాహనాల ప్రమాద బీమా, చెక్ బౌన్స్, ప్రీ లిటీకేషన్ కేసులు రాజీ పద్ధతిలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. కక్షిదారులు దీన్ని వినియోగించుకుని సమయం, డబ్బు ఆదా చేసుకోవడంతో పాటు, కేసుల నుంచి విముక్తి పొందాలని సూచించారు.

ఇంటర్ ఇంగ్లీషు పరీక్షకు 11 మంది గైర్హాజరు

కొవ్వూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీషు పరీక్షను పట్టణం, మండలంలోని 463 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 452 మంది హాజరై, 11 మంది గైర్హాజరయ్యారు. అలాగే కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 248 మందికి గాను 241 మంది హాజరవ్వగా... ఏడుగురు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 141 మందికి గాను 137 మంది హాజరవ్వగా ... నలుగురు గైర్హాజరయ్యారు. కుమారదేవం గురుకుల కళాశాలలో 74 మందికి 74 మంది హాజరయ్యారు.

చర్చిల అనుమతులపై విచారణ దుర్మార్గం

కొవ్వూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : చర్చిల అనుమతులపై విచారణ దుర్మార్గమని మాల సంఘాల జేఏసీ కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ అన్నారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి జారీ చేసిన ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. ఫిబ్రవరి 10వ తేదీన పంచాతీరాజ్ కమిషనర్ రాష్ట్రంలోని 26 జిల్లాల కలెక్టర్లను తమ పరిధిలోని గ్రామాలలో ఉన్న చర్చిల అనుమతులు పరిశీలించాలని ఆదేశాలు ఇవ్వడం బాధాకరమన్నారు. ఈ చర్యలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 25కి విరుద్ధమన్నారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలపై సర్వేలు నిలుపుదల చేయాలని ఇటీవల సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబాకు పూజలు చేస్తున్న దృశ్యం

నల్లజర్ల, మార్చి5 (ఆంధ్రజ్యోతి): కవులూరులోని షిర్డీ సాయిబాబా ఆలయ పదో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్. రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుదేవల ఆశీస్సులు కోరుతూ భక్తులు బాబాను దర్శించుకున్నారు. ఉదయం కాకడ హారతి, సుప్రభాతం, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురువులు పాతూరి సరస్వతి (ఇన్‌చార్జి), సీహెచ్ చిన్న పుల్లయ్య, గురుదేవులు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

విచక్షణా రహితంగా పురుగుల మందు వాడొద్దు

గోపాలపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ సాగులో విచక్షణా రహితంగా పురుగుమందులు వినియోగించరాదని కలవచర్ల కృషీ విజ్ఞాన కేంద్రం కీటక విభాగ శాస్త్రవేత్త విజయప్రసాద్ అన్నారు. కరగపాడు, కొవ్వూరుపాడులో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాగులో సమగ్ర సస్య రక్షణలో భాగమైన మిత్రపురుగులను రైతులు సంరక్షించాలన్నారు. ఏవో రాజారావు, వ్యవసాయ అనుబంధ శాఖలైన ఉద్యాన అధికారి రమేష్, సీఐలు, వీహెచ్‌ఏలు, దేవరపల్లి ఉద్యాన అధికారి వివేక్, రైతులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో గరుడపక్షి



ఆలయంలో ప్రత్యక్షమైన పక్షి

కొవ్వూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి స్నానఘట్టంలోని అన్నపూర్ణ విశాలాక్షి కాశీవిశ్వేశ్వర ఆలయం వద్ద బుధవారం ఓ గరుడపక్షి కనిపించింది. షష్ఠి సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెళ్లిపోయింది.